RNI: TEL TEL /2019/12836

# అభ్యుదయం

The Pride of Telugu national daily



Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో నియోజక వర్గాల వారిగా విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263

పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ శుక్రవారం-11- 9- 2026 సంపుటి : 6 సంచిక : 215 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00

## నిబంధనలకు విరుద్ధంగా
# భూముల కేటాయింపు




- ■ కొండల్ రెడ్డికి అక్రమకేటాయింపులు
- ■ 200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని ఇచ్చారు
- ■ ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించాం
- ■ ప్రశ్నించినందుకే ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారు
- ■ బినామీ కంపెనీల లబ్ధికోసమే సిఎం పనిచేస్తున్నారు
- ■ 'ఇజ్రాయెల్ ఇన్నోవేషన్'తో అక్రమ ఒప్పందాలు
- ■ ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ల పేరుతో అంత దోపిడీ
- ■ సొంత తమ్ముళ్లకు మాత్రం అద్భుతమైన ఉపాధి
- ■ వందల కోట్ల ఆస్తులు కట్టబెడుతోన్న ప్రభుత్వం
- ■ నిజాయతీ ఉంటే వెంటనే కేంద్రం స్పందించాలి
- ■ సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలు వెలికితీయాలి
- ■ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు
- ■ రేవంత్ రెడ్డికి సొంత ఊరి నుంచే కౌంట్‌డౌన్ షురూ
- ■ ఫ్యూచర్ సిటీలో కొండల్ రెడ్డి భూముల పరిశీలన
- ■ ఫ్యూచర్ సిటీ భూముల వద్ద తీవ్ర ఉద్రిక్తత..
- ■ కేటీఆర్, హరీశ్ రావు ఆధ్వర్యంలో భారీ నిరసన!

హైదారాబాద్, **అభ్యుదయం**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోదరుడు కొండల్ రెడ్డికి చెందిన షెల్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ. 200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని కట్టబెట్టారని, ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వరుసగా సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. టెస్సరాక్ట్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన భూములను పరిశీలించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీశ్ రావు నేతృత్వంలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం క్షేత్రస్థాయికి చేరుకుంది. కొండల్ రెడ్డికి అనుకూలంగా ప్రభుత్వం ఈ భూములను కట్టబెట్టిందని ప్రధానంగా ఆరోపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, వివాదాస్పద భూములను స్వయంగా పరిశీలించేందుకు తుక్కుగూడ పరిసర ప్రాంతాలకు భారీ కాన్వాయ్‌తో చేరుకోవడంతో ఒక్కసారిగా అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మిగతా 2లో

## నూతనంగా 21 కొత్త పోషకాహార కేంద్రాలు



- ●అందుబాటులోనికి రానున్న 175 పడకలు
- ●ప్రస్తుతం 21 కేంద్రాలు 340 పడకలు
- ●రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్



## 90 ఎంఎల్ వేసుకుని ఆ ఫేక్ అకౌంట్ సృష్టించారా?

- 'సంధ్యా రావు' అనే ఫేక్ ఐడీని కాంగ్రెస్ సృష్టించింది
-రేవంత్ రెడ్డిపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆగ్రహం

## నూతన శకంలోకి
# లైఫ్ సైన్సెస్

- పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా అడుగులు
- 2,000కు పైగా కంపెనీలతో ఎకోసిస్టమ్
- వ్యాక్సిన్ల తయారీలో గ్లోబల్ లీడర్‌గా హైదరాబాద్
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు
- లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణల్లో నూతనాధ్యాయం
- - ఎంఎస్‌డీ టెక్నాలజీ సెంటర్ ప్రారంభం

మిగతా 2లో



హైదారాబాద్, **అభ్యుదయం**
తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం ఈ కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌డీ డిజిటల్ హ్యూమన్ హెల్త్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ నారాయణ్ సింగ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రితేష్ శ్రీవాస్తవ, తెలంగాణ ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ, తెలంగాణ లైఫ్ సైన్సెస్ సీఈవో సర్వేశ్ సింగ్‌తో పాటు సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## ఈనెల 17 న ఘనంగా
# ప్రజా పాలనా దినోత్సవం



**పబ్లిక్ గార్డెన్ లో విస్తృత ఏర్పాట్లు చేయాలి**
**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఏర్పాట్లపై సచివాలయంలో సిఎస్ సమీక్ష**

మిగతా 2లో

హైదారాబాద్, సెప్టెంబర్ 10(ఆర్ఎన్ఏ):
ఈనెల 17 వతేదీన నాంపల్లి లోని పబ్లిక్ గార్డెన్ లో నిర్వహించే తెలంగాణా ప్రజా పాలన దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ప్రజాపాలన దినోత్సవం నిర్వహణా ఏర్పాట్లపై గురువారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు

# కాంగ్రెస్ పార్టీ ఫేక్ అకౌంట్లు సృష్టిస్తోంది

## ఫేక్ సోషల్ మీడియా ద్వారా మాపై దాడిచేస్తోంది




- ● ఫేక్ వార్తను అసెంబ్లీలో రేవంత్ ప్రస్తావిస్తున్నారు
- ● సభకు, ప్రజలకు సిఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి
- ● సిఎంపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తాం
- ● నీళ్లు ఉండి మోటార్లు నడపడం చాతకాని సిఎం
- ● ఇలాంటి ముఖ్యమంత్రిని నిన్నే చూస్తున్నా..
- ● రేవంత్ రెడ్డి మార్షల్స్‌తో మమ్మల్ని ఎత్తడం కాదు..
- ● మోటార్లు ఆన్ చేసి రైతులకు నీళ్లు ఎత్తు రేవంత్
- ● బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు వెల్లడి

హైదారాబాద్, **అభ్యుదయం**
కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికగా ఫేక్ అకౌంట్లను సృష్టించి ప్రతిపక్షాలపై అత్యంత దుర్మార్గమైన దాడికి పాల్పడుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులే స్వయంగా నిర్వహిస్తున్న ఒక ఫేక్ అకౌంట్‌లోని పోస్టులను పట్టుకుని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రస్తావించడం కన్నా దౌర్భాగ్య పరిస్థితి మరొకటి లేదని ఎద్దేవా చేశారు. తాజాగా సోషల్ మీడియాలో కలకలం రేపుతున్న 'సంధ్యా రావు' అనే ఫేక్ అకౌంట్ వెనుక కాంగ్రెస్ పార్టీ హ్యాండ్లర్లే ఉన్నారని హరీశ్‌రావు ఆరోపించారు.

ఆ నకిలీ ఖాతాలో చేసిన వ్యాఖ్యల ఆధారంగా ముఖ్యమంత్రి శాసనసభను తప్పుదోవ పట్టించారని, దీనికి బాధ్యత వహిస్తూ రేవంత్ రెడ్డి వెంటనే సభకు, ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సదరు ఫేక్ అకౌంట్‌పై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, దాని వెనుక ఉన్న ముఠాను అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించిన అంశంపై ముఖ్యమంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తామని... అలాగే ఈ పరువు నష్టం, నకిలీ ఖాతాల వ్యవహారంపై పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి మార్షల్స్‌తో మమ్మల్ని ఎత్తడం కాదు.. మోటార్లు ఆన్ చేసి రైతులకు నీళ్లు ఎత్తు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు - మిగతా 2లో పేజిలో



## రాష్ట్ర ఆర్థిక వృద్ధికి జిల్లాలే చోదక శక్తులు

- ●అవకాశాలను అన్ లాక్ చేస్తేనే జీఎస్డీపీ లక్ష్యం సాధ్యం
- ●పెట్టుబడుల్ని ఆకర్షించేలా అక్టోబరులో ప్రాంతీయ సదస్సులు
- ●ముఖ్యమంత్రి చంద్రబాబు

2లో



## వరికపుడిశిల లిఫ్ట్ స్కీమ్‌ను వేగవంతం చేయాలి

-అక్టోబర్ నాటికి డీపీఆర్, ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేయాలి
-భూసేకరణను నాలుగు నెలల్లో పూర్తి చేయాలి
-జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

అభ్యుదయం
The Pride of Telugu national daily
శుక్రవారం11-9-2026

# నూతనంగా 21 కొత్త పోషకాహార కేంద్రాలు

అమరావతి,రాష్ట్రంలో తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులకు వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి. కొత్తగా 21 పోషకాహార పునరావాస కేంద్రాలు (ఎన్ఆర్‌సీలు) ఏర్పాటు కాబోతున్నాయి. వీటి ద్వారా 175 పడకలు అదనంగా అందుబాటులోకి రానున్నాయి. ఇందులో ఎనిమిది 10 పడకల ఎన్ఆర్‌సీలు, ఏడు 5 పడకల ఇంటిగ్రేటెడ్ ఎన్ఆర్‌సీలు, మరో ఆరు 10 పడకల కొత్త కేంద్రాలు దశలవారీగా వినియోగంలోకి రానున్నాయి. ఇవన్నీ అందుబాటులోకి వస్తే రాష్ట్రంలో ఎన్ఆర్‌సీల సంఖ్య 21 నుంచి 42కు, పడకల సంఖ్య 340 నుంచి 515కు పెరుగుతాయని రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

**అరకుతో మొదలు.. నరసరావుపేట వరకు:**

ఇంతకు ముందు మంజూరైన ఎనిమిది 10 పడకల కేంద్రాలు అల్లూరి సీతారామరాజు జిల్లాలో అరకు, ముంచింగిపుట్, చింతపల్లి, అనకాపల్లి, బాపట్ల, నంద్యాల, సున్నిపెంట; పల్నాడు జిల్లాలో నరసరావుపేటలో రానున్నాయి. ఒక్కో కేంద్రంలో 10 పడకలు చొప్పున మొత్తం 80 పడకలు అందుబాటులోకొస్తాయి. వీటిలో అరకు, నంద్యాల కేంద్రాల్లో పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. త్వరలో ఇవి వినియోగంలోకొస్తాయి. ముంచింగిపుట్‌లో సివిల్ పనులకు టెండర్ ప్రక్రియలో ఉంది. చింతపల్లిలో కొత్త భవనం నిర్మాణంలో ఉంది. అనకాపల్లిలో పనులు జరుగుతున్నాయి. గిరిజన ప్రాంతాల్లో పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారుల కోసం 7 ఇంటిగ్రేటెడ్ ఎన్ఆర్‌సీలు ఏర్పాటు చేస్తున్నారు. పోలవరం ప్రాంతంలోని అడ్డతీగల, వై.రామవరం, పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు, పాలకొండ, బద్రగిరి, కురుపాం, చినమేరంగిలో ఇవి రానున్నాయి. ఒక్కో కేంద్రంలో ఐదు పడకలు చొప్పున మొత్తం 35 పడకలు ఉంటాయి. అడ్డతీగల, వై.రామవరం కేంద్రాలను త్వరలో ప్రారంభించనున్నారు. కొత్త కేంద్రాల వల్ల తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలకు వారి ప్రాంతానికి దగ్గర్లోనే చికిత్స అందుతుంది.

# 90 ఎంఎల్ వేసుకుని ఆ ఫేక్ అకౌంట్ సృష్టించారా?

హైదారాబాద్, సెప్టెంబర్ 10 శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'సంధ్యా రావు' అనే ఎక్స్ ఐడీ చేసిన ట్వీట్ ను ప్రదర్శించడంపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అసెంబ్లీలో ఒక నకిలీ ఖాతా ఆధారంగా సీఎం మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని, అసలు ఏ రాజకీయ పార్టీకైనా 'అంతర్జాతీయ కార్యదర్శి' అనే పదవి ఉంటుందా అని ఆయన ఎద్దేవా చేశారు. ప్రపంచంలో ఏ రాజకీయ పార్టీకి కూడా అంతర్జాతీయ కార్యదర్శి అనే పదవి ఉండదని... అలాంటిది 'సంధ్యా రావు' అనే పేరుతో బీఆర్ఎస్ అంతర్జాతీయ కార్యదర్శి అని రేవంత్ రెడ్డే కొత్త పదవిని సృష్టించారని దుయ్యబట్టారు. ఫేక్ ఐడీ పోస్టులను సృష్టించేటప్పుడు కాంగ్రెస్ నేతలు లేదా సీఎం ఏమైనా '90ఎంఎల్' వేసుకుని ఉన్నారా? అని ఘాటుగా ప్రశ్నించారు. ఈ డ్రామా వెనుక ఉన్న అసలు సూత్రధారి రేవంత్ రెడ్డేనని ఆరోపించారు. కాంగ్రెస్ ఐటీ సెల్ ద్వారానే 'సంధ్యా రావు' అనే ఫేక్ ఐడీని సృష్టించి, దాంతో తప్పుడు పోస్టులు పెట్టించి, ఆపై అదే అంశంపై రేవంత్ రెడ్డే స్వయంగా సిట్ విచారణకు ఆదేశించడం విచిత్రంగా ఉందని ధ్వజమెత్తారు.

# ఈనెల 17 న ఘనంగా ప్రజా పాలనా దినోత్సవం

జయేష్ రంజన్, వికాస్ రాజ్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు నవీన్ మిట్టల్, క్రిస్టినా చొంగ్తూ, శిఖా గోయల్, హైదాబాద్
సి.పీ సజ్జనార్, ఆర్టీసీ ఎండి నాగి రెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి తదితర సీనియర్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, ప్రజా పాలనా దినోత్సవాన్ని పబ్లిక్ గార్డెన్ లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 17 న ఉదయం అసెంబ్లీ ఎదురుగా గల అమరవీరుల స్థూపం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి నివాళులు అర్పించిన అనంతరం పబ్లిక్ గార్డెన్ కు వస్తారని తెలిపారు. నగరంలోని పలు ప్రధాన భవనాలకు , చారిత్రక కట్టడాలకు విద్యుత్ దీపాల అలంకరణ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణ కు గానూ ఈనెల 15 న పూర్తి డ్రెస్ రిహార్సల్స్ ను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రజాపాలన దినోత్సవానికి వేయి మంది స్వయం సహాయక మహిళలతో పాటు రెండు వేల మంది హాజరవుతారని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఫేక్ అకౌంట్లు సృష్టిస్తోంది




సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అదే మహబూబ్ నగర్ జిల్లాలో భీమా ప్రాజెక్టులో 3 మోటార్లు ఉంటే ఒక్క మోటార్ మాత్రమే నడుపుతున్నారు. నికర జలాల కేటాయింపులున్న ప్రాజెక్ట్ భీమా. కానీ ఏ జలాల కేటాయింపులు లేని, బేసిన్ లేని వెలిగొండకి మాత్రం చంద్రబాబు నీళు తీసుకుపోతడు.. బేసిన్లు ఉన్న నికర జలాల కేటాయింపులు ఉన్న అన్ని అనుమతులున్న భీమా మోటార్లు ఎందుకు నడపడం లేదు రేవంత్ రెడ్డి.. ఇదేనా నీకు పాలమూరు మీద ఉన్న ప్రేమ అని హరీశ్ రావు అడిగారు.కరువు పీడిత ప్రాంతం నడిగడ్డ, గద్వాల, అలంపూర్ ప్రాంతానికి నీళ్లిచ్చే నెట్టంపాడులో 4 మోటార్లు ఉంటే ఒకటే నడుపుతున్నారన్నారు హరీశ్ రావు . కోయిల్ సాగర్‌లో 3 మోటార్లు ఉంటే ఒక్కటే నడుపుతున్నారు. రెండు మోటార్లు నడిపితేనే కోయిల్ సాగర్ నిండడానికి 3 నెలలు పడుతుంది.. ఇప్పుడు నువ్వు ఒక్కటే మోటార్ నడిపితే అది నిండడానికి 6 నెలలు పడుతుంది. 6 నెలల వరకు జూరాల ప్రాజెక్టులో నీళ్లు ఉంటాయా..? కోయిల్ సాగర్ నిండుతదా అని ప్రశ్నించారు.

# రాష్ట్ర ఆర్థిక వృద్ధికి జిల్లాలే చోదక శక్తులు

అమరావతి, జీఎస్‌డీపీ లక్ష్యాన్ని చేరుకునేలా జిల్లాల్లో ఉన్న అవకాశాలను అన్‌లాక్ చేయాలని, స్థానిక వనరులను సమర్థంగా మార్కెటింగ్ చేసుకుని సంపద సృష్టించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. జిల్లాల వారీగా వృద్ధి సమాచారాన్ని మంత్రులు, కలెక్టర్లకు అందించేలా ఆర్టీజీఎస్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెట్టుబడుల గ్రౌండింగ్, జీఎస్‌డీపీ సహా వివిధ అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ధరల సూచీ సహా వివిధ అంశాలను పరిగణించేందుకు 2022-23ను బేస్ ఇయర్ గా కేంద్రం నిర్ధారించిందని అధికారులు తెలిపారు. ప్రస్తుత ధరల మేరకు 2026--27 వృద్ధిరేటు అంచనా 13.44 శాతంగా నమోదైందని వెల్లడించారు. వ్యవసాయ అనుబంధ రంగాల జీవీఏ వృద్ధిరేటు 2026--27 తొలి త్రైమాసికంలో 14.19 శాతానికి పెరిగిందని, పరిశ్రమల రంగంలో 14.81 శాతం, సేవల రంగంలో 12.70 శాతం వృద్ధి నమోదైందని వివరించారు. అక్వా రంగంలో 6.61 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో 31.77 శాతం వృద్ధి నమోదైందన్నారు.

**14.28 శాతం పెరిగిన విద్యుత్ వినియోగం:**

విద్యుత్ ఉత్పత్తి 24,248 మిలియన్ యూనిట్ల నుంచి 28,664 మిలియన్ యూనిట్లకు పెరిగిందని, విద్యుత్ వినియోగం 14.28 శాతం పెరిగిందని అధికారులు తెలిపారు. ఇక పారిశ్రామిక ఉత్పత్తిలో తొలి త్రైమాసికంలో రూ.1,13,638 కోట్ల జీవీఏ నమోదైందని, సేవల రంగంలో 2026--27 తొలి త్రైమాసికానికి రూ.1,60,107 కోట్ల జీవీఏ నమోదైందని వివరించారు. జీఎస్టీ ఆదాయంలోనూ 18 శాతం మేర పెరుగుదల నమోదైందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టాస్క్‌ఫోర్స్ కలిగిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని తెలిపారు. ఇప్పటివరకు జరిగిన 20 రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశాల్లో 359 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామని, రూ.13.85 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు, 10.6 లక్షల ఉద్యోగాలు వచ్చేలా ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఎస్ఐపీబీ సమావేశాల్లో ఆమోదం పొందిన ప్రాజెక్టుల్లో ఇప్పటికే 160 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయని, రూ.4.03 లక్షల కోట్ల పెట్టుబడులతో 5.9 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఎస్ఐపీబీలో అనుమతులు పొందిన ప్రాజెక్టులను వేగంగా గ్రౌండ్ చేసేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను కూడా ఖరారు చేయాలని, ప్రాజెక్టులు గ్రౌండ్ కావడంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని ఆదేశించారు.

**ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం:**

రాష్ట్రంలో ప్రస్తుతం తయారీ, సేవలు, వాణిజ్య రంగాల్లో 23.85 లక్షల ఎంఎస్ఎంఈలు ఉన్నాయని అధికారులు తెలిపారు. 175 ఎంఎస్ఎంఈ పార్కులకు గాను ఇప్పటికే 138 పార్కులకు ఆమోదం లభించిందని, 22 పార్కులు ప్రారంభమయ్యాయని, మిగతా 116 పార్కులు నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. వీటి ద్వారా రూ.2,036 కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉండగా, 31,163 మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది పెట్టుబడుల సదస్సులో భాగంగా విశాఖ, కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతిలో సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు అక్టోబరులో ప్రాంతీయ కాన్ఫరెన్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పెట్టుబడులను మరింతగా ఆకర్షించేలా నవంబరులో 2026 భాగస్వామ్య సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ం

## వరికపుడిశిల లిఫ్ట్ స్కీమ్‌ను వేగవంతం చేయాలి

అమరావతి,పల్నాడు జిల్లాలోని మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా చేపట్టిన వరికపుడిశిల లిఫ్ట్ స్కీమ్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయంలో వరికపుడిశిల లిఫ్ట్ స్కీమ్ ప్రాజెక్టుపై పల్నాడు జిల్లా ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, ప్రాజెక్టు సీఈ, ఎస్ఈ, ఏజెన్సీల ప్రతినిధులు, ఇరిగేషన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్, సర్వే, భూసేకరణ అంశాలపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. ప్రాజెక్టు పురోగతికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పల్నాడు జిల్లాలో సుమారు 84 వేల ఎకరాల మెట్ట భూములకు సాగునీరు అందించడమే వరికపుడిశిల లిఫ్ట్ స్కీమ్ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. మెట్ట ప్రాంత రైతుల చిరకాల సాగునీటి అవసరాలను తీర్చేందుకు ఈ ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం వరికపుడిశిల ప్రాజెక్టును 36 ప్రాధాన్యతా ప్రాజెక్టుల్లో చేర్చిందని మంత్రి నిమ్మల తెలిపారు. ప్రాజెక్టును కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా, అవసం మైన అన్ని ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు.

# నిబంధనలకు విరుద్ధంగా భూముల కేటాయిపు




ఈ పరిశీలన పర్యటనలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు. చేతుల్లో ప్లకార్డులు, భారీ బ్యానర్లు పట్టుకుని నేతలు ఆందోళన నిర్వహించారు. ప్రజాధనంతో ముడిపడి ఉన్న విలువైన ప్రభుత్వ భూములను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై వారు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ సంఘటనా స్థలంలో నిరసన చేపట్టారు. ఈ భూముల అంశం అసెంబ్లీలోనూ తీవ్ర గందరగోళానికి దారితీసింది. సభలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నంలో భాగంగా పోడియం వద్దకు దూసుకెళ్లిన బీఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలను ఖండిస్తూ పోడియం వద్ద పేపర్లు చింపి పైకి ఎగురవేయడంతో సభలో గందరగోళం తలెత్తింది. సభ్యుల ఆందోళన అదుపు తప్పడంతో స్పీకర్/చైర్మన్ జోక్యం చేసుకుని, సభా మర్యాదలను కాపాడేందుకు మార్షల్స్‌ను రంగంలోకి దించాలని ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీలో నిరసనల అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన కోసం కేటీఆర్, హరీశ్ రావు నేతృత్వంలోని ఎమ్మెల్యేలు తుక్కుగూడలోని టెస్సరాక్ట్ సైట్‌కు చేరుకోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు పేరుతో జరుగుతున్న భూకేటాయింపులపై పూర్తిస్థాయి వాస్తవాలను ప్రజల ముందుకు తెస్తామని, ఈ అంశంపై న్యాయపరమైన, ప్రజా పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. నాయకుల రాకతో స్థానిక పరిసరాల్లో భారీగా మోహరించిన పోలీసులు శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. పర్యవేక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని నిత్యం చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, ఆ సమయాన్నంతా తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కాకుండా తన సొంత సోదరులు, బినామీ షెల్ కంపెనీల లబ్ధి కోసమే కేటాయిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేవలం రూ. లక్ష మూలధనంతో నడిచే కంపెనీకి ఐదెకరాల విలువైన భూమిని ఎలా కేటాయిస్తారని కేటీఆర్ నిలదీశారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎవరైనా కేవలం లక్ష రూపాయలతో స్టార్టప్ పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే వందల కోట్ల విలువైన భూములు ఇస్తుందా..? అని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇజ్రాయెల్ వ్యాపార భాగస్వామ్యా లపై ప్రధాని మోదీని ప్రశ్నిస్తుంటే, ఇక్కడ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రేవంత్ రెడ్డి సోదరుడి కోసం 'ఇజ్రాయెల్ ఇన్నోవేషన్' సంస్థతో ఒప్పందాలు కుదుర్చుకుని ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ల పేరుతో భూములు కొల్లగొడు తోందని ఆరోపించారు.

నెలకు రూ.4,000 పింఛన్, మహిళలకు రూ.2,500, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలకు మొండిచేయి చూపించిన కాంగ్రెస్, సీఎం సొంత తమ్ముళ్లకు మాత్రం అద్భుతమైన ఉపాధి, వందల కోట్ల ఆస్తులు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. ఈ భారీ భూ కుంభకోణంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే తక్షణమే ప్రవర్తన, పత్రాలపై ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నూతన శకంలోకి లైఫ్ సైన్సెస్

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్ లైఫ్ సైన్సెస్ రంగం పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా నూతన శకంలోకి అడుగుపెట్టిందని హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణలో 2,000కు పైగా కంపెనీలతో సంపూర్ణమైన లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్ ఉందని, వ్యాక్సిన్ల తయారీలో హైదరాబాద్ ఇప్పటికే గ్లోబల్ లీడర్‌గా ఎదిగిందని తెలిపారు. అంతేకాకుండా అమెరికా వెలుపల అత్యధిక యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన సంస్థలు హైదరాబాద్‌లోనే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రం కేవలం ఔషధ తయారీకే పరిమితం కాకుండా అధునాతన ఆర్ అండ్ డీ), గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాల దిశగా దూసుకుపోతోందని చెప్పారు. గత రెండేళ్ల కాలంలో ఆమ్‌జెన్, ఎలీ లిల్లీ, బ్రిస్టల్ మైయర్స్ స్క్విబ్, సనోఫీ, అలైన్ టెక్నాలజీ, జోయెటిస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌లో తమ కేంద్రాలను ఏర్పాటు చేశాయని మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'నెక్స్ట్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30' ద్వారా డ్రగ్ డిస్కవరీ నుంచి మ్యానుఫ్యాక్చరింగ్, క్లినికల్ రీసెర్చ్ మరియు అత్యాధునిక టెక్నాలజీల అనుసంధానానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. గత ఏడాది ఏర్పాటైన 75కు పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు తోడుగా, త్వరలోనే జీసీసీల సంఖ్యను 100కు చేరుస్తామని, దీనిద్వారా దాదాపు 4 లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగావకాశాలు లభిస్తాయని వెల్లడించారు. అంతేకాకుండా భారత్ ఫ్యూచర్ సిటీలో 2,100 ఎకరాల లైఫ్ సైన్సెస్ జోన్, ప్రత్యేకంగా 100 ఎకరాల్లో బయోలాజిక్స్ హబ్‌తో పాటు 1బయో మోడల్ మౌలిక వసతులను కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ఎంఎస్‌డీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ నారాయణ్ సింగ్ మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయి డిజిటల్ సామర్థ్యాలను విస్తరించేందుకు హైదరాబాద్‌లో విస్తారమైన ప్రతిభ, అత్యుత్తమ టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉన్నాయని, అందుకే ఈ నగరాన్ని ఎంచుకున్నామని తెలిపారు. ఈ నూతన కేంద్రం ద్వారా డిజిటల్, డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ), ఇంజినీరింగ్ సాంకేతికతలతో ప్రపంచవ్యాప్తంగా మానవ మరియు జంతు ఆరోగ్య రక్షణకు అవసరమైన పరిష్కారాలను అందిస్తామని సంస్థ స్పష్టం చేసింది.

# డీకే శివకుమార్ ప్రభుత్వం సరైన దిశలోనే వెళుతోంది

## ఐదు గ్యారెంటీలను సవ్యంగా అమలు చేస్తున్నాము

## మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10

కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం సరైన దిశలోనే పయనిస్తోందని మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు. శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు, ఆయన మంత్రివర్గానికి సిద్ధరామయ్య అభినందనలు తెలియజేశారు. విధానసౌధలోని బాంక్వెట్ హాల్‌లో గురువారం నిర్వహించిన 'దృఢ కర్ణాటక సంకల్ప – 100 రోజుల విజయవంతమైన ప్రస్థానం' కార్యక్రమంలో సిద్ధరామయ్య ప్రసంగించారు.



100 రోజుల మైలురాయి అనేది కేవలం వేడుకలకు పరిమితం కాకూడదని, ప్రభుత్వం తన పనితీరును ప్రజల ముందు ఉంచి, బాధ్యతలను ఏ మేరకు నెరవేరుస్తోందో నిరూపించుకోవడానికి ఇదొక చక్కని అవకాశమని ఆయన పేర్కొన్నారు. డీకే శివకుమార్ నేతృత్వంలోని సర్కార్ సరైన మార్గంలోనే సాగుతోందని తాను భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతిపక్షాల నుంచి విమర్శలు ఎదురైనప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీ పథకాలను విజయవంతంగా అమలు చేసిందని సిద్ధరామయ్య గుర్తు చేశారు. ఈ పథకాల కోసం ఏటా సుమారు రూ. 52,000 కోట్లు వెచ్చిస్తున్నట్లు ఆయన వివరించారు. సామాజిక అసమానతలను తొలగించి, అన్ని వర్గాల పేదలకు అండగా నిలవడమే ఈ పథకాల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇదే తరుణంలో ప్రతిపక్ష బీజేపీ తీరుపై సిద్ధరామయ్య విమర్శలు గుప్పించారు. బీజేపీ చేపట్టిన 'బళ్లారి చలో' పాదయాత్రను కేవలం ఒక రాజకీయ గిమ్మిక్కుగా ఆయన అభివర్ణించారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలోని కరువు పరిస్థితులపై చర్చించకుండా, కేవలం మాజీ మంత్రి నాగేంద్ర రాజీనామా అంశంపైనే బీజేపీ రాజకీయం చేస్తోందని ఆరోపించారు.

కరవు సహాయక చర్యల కోసం పూర్తిగా కేంద్రంపైనే ఆధారపడవద్దని, అవసరమైన తాలూకాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించి, రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకోవాలని సీఎం శివకుమార్‌కు సూచించారు. పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉండాలని ఆయన కోరారు.

## డిజిటల్ కనెక్టివిటీ పై సమీక్ష

అమరావతి, సెప్టెంబర్ 10 కలెక్టర్ల సమావేశంలో డిజిటల్ కనెక్టివిటీ పై సమీక్ష జరిపిన చంద్రబాబు రాష్ట్రంలో మారుమూల గ్రామాలకూ వంద శాతం మొబైల్ కనెక్టివిటీ ఉండాలని ఆదేశించారు. రాష్ట్రంలో డిజిటల్ కనెక్టివిటీ, మొబైల్ నెట్‌వర్క్ విస్తరణపై ఐటీ,ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ సమగ్రమైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికీ 4జీ,5జీ సేవలను నిరంతరాయంగా అందించేందుకు చేపట్టిన చర్యలను ఆయన వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల కింద బీఎస్ఎన్ఎల్, జియో సంస్థల ద్వారా రాష్ట్రానికి మొత్తం 1,023 టెలికాం టవర్లు మంజూరయ్యాయని తెలిపారు. వీటిలో ఇప్పటికే 143 చోట్ల పనులు పూర్తయి సిగ్నల్స్ వస్తున్నాయని, 428 చోట్ల పనులు జరుగుతున్నాయని, భూమి అప్పగించిన 423 ప్రాంతాల్లో పనులు మొదలుకావాల్సి ఉందని పేర్కొన్నారు. ఇంకా వివిధ జిల్లాల్లో 18 చోట్ల రెవెన్యూ భూమి, మరో 11 చోట్ల అటవీ భూముల క్లియరెన్స్ పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఈ వివరాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ టవర్ల ఏర్పాటులో జాప్యంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతాలతో సహా రాష్ట్రం నలుమూలలా కనెక్టివిటీ ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యమని, అవసరమైతే ఇన్సెంటివ్‌లు కూడా ఇస్తామని ముందే చెప్పినప్పుడు అధికారులు భూమి కేటాయింపుల్లో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. బాధ్యతను వేరొకరిపై నెట్టేసే పద్ధతి మానుకుని స్వయంగా బాధ్యత తీసుకుని పని చేయాలని స్పష్టం చేశారు.

## ఇంధన ప్రాజెక్టుల గ్రౌండింగ్‌కు కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలి ఇంధన శాఖ స్పెషల్ సి.ఎస్. కె. విజయానంద్

అమరావతి, సెప్టెంబర్ 10 8వ కలెక్టర్ల సదస్సులో రాష్ట్ర ఇంధన రంగానికి సంబంధించి ఎస్ఐపిబి ఆమోదించిన పెట్టుబడుల పురోగతిని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ వివరిస్తూ రాష్ట్రంలో ఆమోదం పొందిన పెట్టుబడులను వేగంగా వాస్తవిక ప్రాజెక్టులుగా మార్చేందుకు జిల్లా కలెక్టర్లు సంబంధిత శాఖలు, ఎన్ఆర్ఈడిసిఎపీ నోడల్ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏపీ ఐసిఈ పాలసీ 2024 కింద ఇప్పటివరకు 6 ప్రాజెక్టులు రూ.11,284 కోట్ల పెట్టుబడితో ప్రారంభమై, సుమారు 4,970 మందికి ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి చేరుకున్నాయని తెలిపారు. ప్రస్తుతం 38 ప్రాజెక్టుల్లో భూసేకరణ ప్రక్రియ కొనసాగుతుండగా, మరో 9 ప్రాజెక్టులు డీపీఆర్ ఫ్రీ పీజిబులిటీ స్టడీ దశలో ఉన్నాయని వివరించారు.

## చైనా షిప్‌యార్డ్‌లో అగ్నిప్రమాదం..

- మరమ్మతుల కోసం ఆగిన కార్గో నౌక
- 20 మంది మృతి, ఐదుగురు గల్లంతు



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10 చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. కింగ్‌డావో బీహై షిప్‌యార్డ్‌లో మరమ్మతుల నిమిత్తం నిలిపి ఉంచిన ఒక కార్గో నౌకలో భారీగా మంటలు చెలరేగాయి. ఈ విషాద ఘటనలో సుమారు 20 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు గల్లంతయ్యారు. లైబీరియా జెండాతో ఉన్న 'ఓషన్ మెలోడీ' అనే కార్గో నౌకను మరమ్మతుల కోసం షిప్‌యార్డ్‌కు తీసుకువచ్చారు. పనులు జరుగుతున్న క్రమంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. ప్రమాదం సంభవించిన సమయంలో నౌకలో మొత్తం 42 మంది సిబ్బంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, ప్రమాదానికి గల కారణాలపై తక్షణమే దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

నౌకలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ప్రధాని లీ కియాంగ్ స్పష్టం చేశారు. చైనా స్టేట్ షిప్‌బిల్డింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడిచే కింగ్‌డావో బీహై షిప్‌యార్డ్, ఆ దేశంలోని అతిపెద్ద నౌకా నిర్మాణ, మరమ్మతు కేంద్రాలలో ఒకటిగా గుర్తింపు పొందింది.

## రంగారెడ్డి జిల్లాలో రియల్టర్ ఆత్మహత్య

హైదారాబాద్, సెప్టెంబర్ 10

హైదరాబాద్ శివారు రంగారెడ్డి జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి, హోమ్ ల్యాండ్ సంస్థ అధినేత రామ్ రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కందుకూరు మండలం నెదునూరు గ్రామంలోని తన ఫామ్‌హౌస్‌లో ఆయన బలవన్మరణం చెందారు. రామ్ రెడ్డి పటాన్‌చెరు ప్రాంతంలో సుమారు 280 ఎకరాల విస్తీర్ణంలో ఒక భారీ వెంచర్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కొందరు రాజకీయ నాయకుల నుంచి ఆయనపై తీవ్ర ఒత్తిడి ఉన్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఆ ఒత్తిళ్లను తట్టుకోలేకే ఆయన ఈ తీవ్ర నిర్ణయం తీసుకుని ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## నాయకత్వంలో కొత్త ఆలోచన..

# పాలనలో సరికొత్త వేగం

**న్యూ ఏజ్ గవర్నెన్స్‌తో స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధన**

**8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు**

అమరావతి, సెప్టెంబర్ 10 : నాయకత్వంలో కొత్త ఆలోచనా విధానంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. అమరావతిలో నిర్వహించిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో లీడర్షిప్ న్యూ ఏజ్ గవర్నెన్స్ అంశంపై ఆయన మాట్లాడారు. ప్రస్తుతం తాము లీడర్షిప్ ట్రాన్సిషన్‌లో ఉన్నామని, న్యూ లీడర్షిప్ అప్రోచ్‌తో పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. నాయకత్వం అనేది సెల్ఫ్ మోటివేషన్‌తో ముడిపడి ఉంటుందని పేర్కొన్నారు. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ఆన్‌లైన్‌లో ఫైల్స్, డేటా లేక్ వంటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సీఎం సూచించారు. ఏఐ ద్వారా డేటాను విశ్లేషించుకుని, ఎక్కడా పొరపాట్లు జరగకుండా చూసుకుంటూ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఉండాలని చెప్పారు. టెక్నాలజీ యుగంలో నేర్చుకోవడం నిరంతర ప్రక్రియగా మారిందని, నైపుణ్యానికి ఎంత పదును పెడితే అంత ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని అన్నారు.

ప్రపంచంలోనే అత్యుత్తమంగా భారతీయ ఎంట్రప్రెన్యూర్స్

మహిళలు?పురుషులు అనే వ్యత్యాసం గత కాలపు నినాదమని, ఇప్పుడు ఆ తేడా లేదని సీఎం చంద్రబాబు అన్నారు. బ్యూరోక్రసీకి, రాజకీయ నేతలకు వేర్వేరు నైపుణ్యాలు ఉండాల్సిందేనని పేర్కొన్నారు. ప్రతి నాయకుడూ తన బృందాన్ని ఎంత ప్రభావవంతంగా నిర్మిస్తారన్నదే ఫలితాలను నిర్ణయిస్తుందని తెలిపారు. ప్రతి రంగంలోనూ సంతృప్తి అనేదే ముఖ్యమని అన్నారు. ప్రపంచంలోనే భారతీయ ఎంట్రప్రెన్యూర్స్ అత్యుత్తమంగా ఉన్నారని, ప్రతిష్ఠాత్మక కంపెనీలకు వారే సారథ్యం వహిస్తున్నారని సీఎం చెప్పారు. ఏ వ్యవస్థలో అయినా ఇమిడిపోయే తత్వం భారతీయులదని, దానికి అనుగుణంగా మనం కూడా ఉండాలని సూచించారు. ప్రస్తుతం ఉద్యోగ వ్యవస్థలే మారిపోతున్నాయని, అంతిమంగా క్రెడిబిలిటీ అనేదే కీలకమని స్పష్టం చేశారు. సమాజంలోని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు తమను తాము మార్చుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. గతంలో చాలా అంశాలపై దృష్టి పెట్టామని,

ఇప్పుడు నాయకత్వంపైనే ఆలోచన చేయాలని నిర్ణయించామని తెలిపారు. నూతన నాయకత్వ విధానంతో పనిచేయడం ద్వారా వేగంగా ఫలితాలను సాధించడంతో పాటు స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలను చేరుకునేందుకు ఆస్కారం ఉంటుందని సీఎం అన్నారు.

## నిజ జీవితంలో విజయ్ హీరో కాదు, విలన్

చెన్నై, సెప్టెంబర్ 10 తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్‌పై ఏఎంఎంకే చీఫ్ టీటీవీ దినకరన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సినిమాల్లోనే విజయ్ హీరో అని, నిజ జీవితంలో మాత్రం ఆయనో ఒక పెద్ద విలన్ అంటూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అసెంబ్లీలో విజయ్ చేసిన ఒక సైగపై వివాదం చెలరేగిన నేపథ్యంలో దినకరన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల తమిళనాడు అసెంబ్లీలో విజయ్ చేసిన ఒక సైగ, ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను అపహాస్యం చేసేలా ఉందన్న విమర్శలతో రాజకీయ దుమారం రేగింది. 1976 ఎమర్జెన్సీ కాలంలో జైలులో పోలీసుల దాడి కారణంగా స్టాలిన్ దవడ ఎముక విరిగింది. విజయ్ చేసిన సైగ ఆ విషయాన్ని ఎగతాళి చేసేలా ఉందని డీఎంకే నేతలు మండిపడ్డారు. అయితే, ఆ సైగ యాదృచ్ఛికంగా జరిగిందే తప్ప ఉద్దేశపూర్వకం కాదని విజయ్ వివరణ ఇచ్చారు. అయినప్పటికీ ఈ వివాదం సద్దుమణగలేదు. స్వయంగా స్టాలిన్ కూడా ఈ అంశంపై స్పందిస్తూ, జైలులో తాను అనుభవించిన చిత్రహింసలను గుర్తుచేసుకున్నారు. తమిళనాడు రాజకీయ చరిత్రను చదువుకోవాలని విజయ్‌కు హితవు పలికారు.

## టీవీకే పార్టీకి అధికారిక గుర్తింపు

### రాష్ట్ర పార్టీ హోదా కల్పిస్తూ ఈసీ నిర్ణయం



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10 ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీకి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) రాష్ట్ర పార్టీగా అధికారిక గుర్తింపునిచ్చింది. పార్టీకి శాశ్వత ఎన్నికల గుర్తుగా 'విజిల్'ను కేటాయిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే కనబరిచిన అద్భుత పనితీరు ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన టీవీకే, మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 108 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. రాష్ట్రవ్యాప్తంగా పోలైన ఓట్లలో 34.92 శాతం సాధించి తన సత్తా చాటింది. ఎన్నికల నిబంధనల ప్రకారం, ఒక పార్టీకి రాష్ట్ర పార్టీ హోదా దక్కాలంటే కనీసం 6 శాతం ఓట్లతో పాటు రెండు అసెంబ్లీ స్థానాలు గెలవాలి లేదా మొత్తం ఓట్లలో 8 శాతం సాధించాలి. టీవీకే ఈ నిబంధనలను సునాయాసంగా అధిగమించి ఈ గుర్తింపును సొంతం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీవీకేకు 'విజిల్'ను ఉమ్మడి గుర్తుగా ఈసీ కేటాయించగా, ఎన్నికల్లో సాధించిన ఘన విజయం నేపథ్యంలో ఇప్పుడు అదే గుర్తునే శాశ్వతంగా ఖరారు చేసింది. తాజా గుర్తింపుతో భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ టీవీకే ఇదే గుర్తుపై పోటీ చేసే అవకాశం లభించింది. తమిళనాడులో ఇప్పటికే గుర్తింపు పొందిన డీఎంకే, ఏఐఏడీఎంకే, సీపీఐ, వీసీకే, నామ్ తమిళర్ కట్చి, డీఎండీకే వంటి పార్టీల సరసన ఇప్పుడు టీవీకే కూడా చేరింది. ఫలితంగా రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీల సంఖ్య ఏడుకు చేరుకుంది. ఈ పరిణామం తమిళ రాజకీయాల్లో టీవీకేను ఒక ప్రధాన శక్తిగా ఆవిష్కరించింది.

## హత్య కేసులో లొంగిపోయిన నిందితుడు

నెల్లూరు, సెప్టెంబర్ 10 నెల్లూరు, తిరుపతి జిల్లాల సరిహద్దు ప్రాంతంలో సంచలనం సృష్టించిన టీడీపీ కార్యకర్త బాలయ్య హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వైసీపీ నేత కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయారు. పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం ఆయనకు 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. దీంతో, పోలీసులు ఆయనను భద్రత నడుమ నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. పెళ్లకూరు మండలం చిల్లకూరు ప్రాంతంలోని కాల్వలు, ప్రభుత్వ పోరంబోకు భూములను సత్యనారాయణ రెడ్డి ఆక్రమించారంటూ స్థానిక టీడీపీ నేతలు గతంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారుల సంయుక్త సర్వేలో ఆక్రమణ నిజమేనని తేలింది. ఆక్రమిత స్థలంలో తన సొంత పొలానికి దారి వేసుకునేందుకు సత్యనారాయణరెడ్డి ప్రయత్నించగా టీడీపీ కార్యకర్త బాలయ్య సహా పలువురు అడ్డుకుని ప్రశ్నించారు. దీంతో ఆక్రోశానికి గురైన సత్యనారాయణరెడ్డి, తన అనుచరులతో కలిసి టీడీపీ నేతలపై దాడికి తెగబడ్డారు. ఈ గొడవలో బాలయ్య ఛాతీపై ప్రత్యర్థులు పిడిగుద్దులతో విరుచుకుపడటంతో ఆయన తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సత్యనారాయణ రెడ్డిని ఏ1 నిందితుడిగా చేర్చి కేసు నమోదు చేయగా... పోలీసు అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఆయన చివరకు కోర్టులో లొంగిపోవాల్సి వచ్చింది.

## అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు

హైదారాబాద్, సెప్టెంబర్ 10 కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా సేవలు అందిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు పనితీరుపై బీజేపీ శాసనసభ్యులు పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. పార్టీలు వేరైనా ప్రజలకు మంచి చేసే నాయకుడిని, వారి నిబద్ధతను గుర్తించి మెచ్చుకోవడంలో తప్పులేదని వారు స్పష్టం చేశారు. "మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు. ప్రజాప్రతినిధులుగా మేము కూడా ఇంతటి ఓపిక, జవాబుదారీతనం ఉన్న మంత్రిని గతంలో చూడలేదు" అని వ్యాఖ్యానించారు.

# పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ ప్రోత్సాహం

**అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలి**
**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**



హనుమకొండ, సెప్టెంబర్ 10
జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను సంబంధిత శాఖల అధికారులు నిబంధనలకు అనుగుణంగా త్వరితగతిన మంజూరు చేయాలని ఆదేశించారు. గురువారం హనుమకొండ కుడా కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ (ఙ×ఖజ), టీజీ-ఐపాస్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్, కమిటీ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో పరిశ్రమల స్థాపన, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, వివిధ శాఖల అనుమతులకు సంబంధించిన దరఖాస్తులపై సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు అనుమతుల విషయంలో జాప్యం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. టీజీ-ఐపాస్ కింద వచ్చిన దరఖాస్తులను కమిటీ పరిశీలించగా, నిబంధనల ప్రకారం అర్హత సాధించిన పలు పారిశ్రామిక యూనిట్లకు ఆమోదం తెలిపింది. అదేవిధంగా టీ-ప్రైడ్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు సరకు రవాణా వాహనాలపై అందించే ప్రోత్సాహకాల కోసం వచ్చిన దరఖాస్తులను కమిటీ సమీక్షించింది. కమర్షియల్ టాక్స్ శాఖ పరిశీలన అనంతరం నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాహనాలకు ప్రోత్సాహకాలను మంజూరు చేశారు.
పారిశ్రామిక రంగాన్ని మరింత ప్రోత్సహించేలా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.
సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, జిల్లా రవాణా అధికారి జనార్దన్ రెడ్డి, ఎల్‌డీఎం విష్ణుప్రియ, కమర్షియల్ టాక్స్ జాయింట్ కమిషనర్, గ వీ-××జ, కాలుష్య నియంత్రణ మండలి, విద్యుత్ శాఖ, ఎస్సీ కార్పొరేషన్, కుడా, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్, గ్రౌండ్ వాటర్ శాఖ, ఙ×జజ× ప్రతినిధులు సహా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

**పర్యావరణహితంగా వినాయక చవితి జరుపుకోవాలి: కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి**
**పోటీలకు పోకుండా ఆధ్యాత్మిక భావనతో నవరాత్రులు నిర్వహించాలి: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**




హన్మకొండ, సెప్టెంబర్ 10
పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి ఈ వినాయక చవితికి మట్టి గణపతులను ప్రతిష్ఠించాలని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్ గుండు సుధారాణి పిలుపునిచ్చారు.

తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం కుడా కార్యాలయంలో మట్టి గణేశ్ విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. హన్మకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయితో కలిసి కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి అధికారులు, సిబ్బందికి మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ వినాయక చవితి మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అని పేర్కొన్నారు. పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మట్టి గణపతులను ప్రతిష్ఠించడం ద్వారా సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు చెరువులు, కుంటలు, ఇతర జలవనరులను కాలుష్యం బారిన పడకుండా రక్షించుకోవచ్చన్నారు. రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయ్యే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమై జలచరాలు, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. సహజసిద్ధమైన మట్టితో తయారైన గణేశ్ విగ్రహాలను వినియోగించడం పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. 'భక్తితో గణపతిని ఆరాధిద్దాం.. బాధ్యతతో ప్రకృతిని కాపాడుదాం. మన వినాయకుడు మట్టితో వస్తే.. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించవచ్చు' అని సుధారాణి పేర్కొన్నారు. ప్రతి కుటుంబం, కాలనీ, గణేష్ మండపం మట్టి గణపతులనే ప్రోత్సహించి పర్యావరణహిత వినాయక చవితికి ఆదర్శంగా నిలవాలని కోరారు.

పోటీలు వద్దు.. ఆధ్యాత్మికతే ముఖ్యం: కలెక్టర్
జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ రసాయనాలు, వివిధ రంగులతో తయారుచేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల చెరువులు, ఇతర జలవనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ప్రజలు మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలని సూచించారు.

# వ్యవసాయ రంగంలో ఆధునిక పరిశోధనలు రైతులకు మేలు చేయాలి

**ఉత్పత్తి వ్యయం తగ్గించి.. దిగుబడి పెంచే సాంకేతికత అవసరం**

**సినర్జీ కంపెనీ నూతన వ్యవసాయ ఉత్పత్తుల ఆవిష్కరణ**

**మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్**




హైదరాబాద్, సెప్టెంబర్ 10
వ్యవసాయ రంగంలో ఆధునిక పరిశోధనలు రైతులకు మేలు చేసేలా ఉండాలని, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తూ భూసారాన్ని కాపాడే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. భూమిలో పోషక లోపాలను సవరించి పోషక సమతుల్యతను కాపాడేందుకు రూపొందించినట్లు సినర్జీ కంపెనీ పేర్కొన్న నూతన కాంబినేషన్ న్యూట్రియెంట్స్ ఉత్పత్తులను బుధవారం ఈటల రాజేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు భారతదేశం కరువు కాటకాలతో తీవ్ర ఆహార కొరతను ఎదుర్కొందని గుర్తుచేశారు. బెంగాల్ కరువు వంటి ఘటనల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయిన పరిస్థితుల నుంచి నేడు దేశం ఆహార ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించే స్థాయికి చేరుకుందన్నారు. హరిత విప్లవం, వ్యవసాయ శాస్త్రవేత్తల పరిశోధనలు దేశ వ్యవసాయ రంగంలో కీలక మార్పులకు దోహదపడ్డాయని పేర్కొన్నారు. శ్వేత విప్లవంతో పాల ఉత్పత్తిలో, నీలి విప్లవంతో మత్స్య సంపదలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. ఎంత సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందినా కోట్లాది ప్రజలకు ఆహారం అందించే వ్యవసాయ రంగానికి, భూమాతకు ప్రత్యామ్నాయం లేదన్నారు.

ఎరువుల వినియోగంలో మార్పులు రావాలి
వ్యవసాయంలో సంప్రదాయంగా డీఏపీ, యూరియా వంటి ఎరువులను పెద్ద మొత్తంలో వినియోగిస్తున్నారని ఈటల పేర్కొన్నారు. రైతులు భూమికి అవసరమైన నైట్రోజన్, పొటాష్, జింక్, సల్ఫర్ తదితర పోషకాల అవసరాన్ని గుర్తించి సమతుల్యంగా వినియోగించే విధానాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. తక్కువ పరిమాణంలోనే మొక్కలకు అవసరమైన పోషకాలను సమర్థవంతంగా అందించే సాంకేతికతపై సినర్జీ సంస్థ పరిశోధనలు చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు వివరించారని తెలిపారు. నైట్రోజన్‌తో పాటు సల్ఫర్‌ను మొక్కలకు అందించే విధంగా నూతన ఉత్పత్తులను రూపొందించినట్లు పేర్కొన్నారు. ఇలాంటి పరిశోధనలు విజయవంతమై శాస్త్రీయంగా నిరూపితమైతే రైతులకు ఎరువుల వినియోగం, సాగు వ్యయం తగ్గడంతో పాటు ప్రభుత్వంపై ఎరువుల సబ్సిడీ భారం తగ్గించేందుకు కూడా దోహదపడే అవకాశం ఉంటుందని ఈటల అభిప్రాయపడ్డారు. పర్యావరణహిత వ్యవసాయానికి ప్రాధాన్యం
వ్యవసాయంలో ఉత్పాదకత పెంచడంతో పాటు సాగు ఖర్చును తగ్గించడం అత్యంత ముఖ్యమని ఈటల అన్నారు. పర్యావరణహిత ఉత్పత్తులు, రైతులు మరియు వినియోగదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని జరుగుతున్న పరిశోధనలు మంచి ఫలితాలు ఇవ్వాలని ఆకాంక్షించారు.

సినర్జీ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ భాస్కర్, వెంకట్ రెడ్డి, చంద్రారెడ్డి, టీవీ రావు తదితరులు వ్యవసాయ రంగంలో మరిన్ని పరిశోధనలు చేపట్టి రైతాంగానికి ఉపయోగపడే ఉత్పత్తులను అందించాలని ఈటల రాజేందర్ ఆకాంక్షించారు.

# జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**రాజీ మార్గమే.. రాజ మార్గం**
**జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**




భూపాలపల్లి, సెప్టెంబర్ 10
ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ సూచించారు. రాజీ పడదగిన క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబపరమైన వివాదాలు, వైవాహిక సంబంధిత కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్, పెట్టీ కేసులు తదితర వివాదాలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. 'రాజీ మార్గమే.. రాజ మార్గం' అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఎస్పీ సూచించారు. చిన్నచిన్న వివాదాలు, కేసుల విషయంలో కక్షలు పెంచుకుని విలువైన సమయం, డబ్బును వృథా చేసుకోవద్దన్నారు. న్యాయశాఖ కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పరస్పర అంగీకారంతో కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి ఇరువర్గాల కక్షిదారులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు. కోర్టు విధులు నిర్వహించే సిబ్బంది సైతం కేసుల పరిష్కారానికి చొరవ చూపాలని పేర్కొన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరితగతిన పరిష్కారమై కక్షిదారులకు సత్వర న్యాయం లభించడంతో పాటు సమయం, ఖర్చు ఆదా అవుతాయని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు.

# బడుగు వర్గాల భవిష్యత్తుకు విద్యే వెలుగుబాట

**● ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు అన్ని రంగాల్లో ముందుకు రావాలి**
**● చదువుతో పాటు ఆధునిక నైపుణ్యాలపై పట్టు సాధించాలి**
**● ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**



హైదరాబాద్, సెప్టెంబర్ 10
బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి విద్యే ప్రధాన ఆయుధమని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని అన్ని రంగాల్లో ముందుకు రావాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు. విద్యతోనే సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.
డాక్టర్ ముప్పారం ప్రకాష్ ఆధ్వర్యంలో మంత్రి దామోదర రాజనర్సింహను జర్నలిస్టులు, ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులు, దళిత--బహుజన విద్యార్థి సంఘాల నాయకులు, వివిధ సామాజిక సంఘాల ప్రతినిధులు కలిసి పలు అంశాలపై చర్చించారు. బడుగు వర్గాలు ఎదుర్కొంటున్న విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక అభివృద్ధికి సంబంధించిన అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి విద్య అత్యంత కీలకమైన సాధనమన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకుని ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. నేటి విద్యార్థులే రేపటి సమాజానికి నాయకత్వం వహించాల్సి ఉంటుందని, లక్ష్యాలను ముందుగానే నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు.

**ఆధునిక నైపుణ్యాలపై దృష్టి పెట్టాలి**

కేవలం డిగ్రీలు సాధించడానికే పరిమితం కాకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, పోటీ పరీక్షలు, పరిశోధన రంగాలపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. దళిత, బహుజన యువత ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలతో పాటు పరిశోధన, సాంకేతిక, వైద్య, ఇంజినీరింగ్, పరిపాలనా రంగాల్లో పెద్ద సంఖ్యలో అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు.

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, తమలోని ప్రతిభను గుర్తించి వివిధ రంగాల్లో రాణించేందుకు ప్రయత్నించాలన్నారు. సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో విద్యార్థులు, యువత కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు.

విద్య, వైద్యం రెండూ కీలకమే
ఆర్థిక పరిస్థితులు ప్రతిభావంతులైన విద్యార్థుల చదువుకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం వివిధ సంక్షేమ కార్యక్రమాల ద్వారా అండగా నిలుస్తోందని మంత్రి తెలిపారు. ఎస్సీ, బీసీ, సోషల్ వెల్ఫేర్ తదితర సంక్షేమ విభాగాల ద్వారా అందుతున్న విద్యా అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలను అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉంచడం ప్రభుత్వ బాధ్యతగా పేర్కొన్నారు. విద్య, ఆరోగ్యం రెండూ కుటుంబంతో పాటు సమాజం, రాష్ట్ర అభివృద్ధికి కీలకమని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు.

విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని చదువుపై ఏకాగ్రత పెంచుకోవాలని, వ్యక్తిత్వం, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని భవిష్యత్ తరాలకు మార్గదర్శకులుగా నిలవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు రమేష్ దారమళ్ల, రంజిత్ జిలుకర, దళిత--బహుజన విద్యార్థి సంఘాల నాయకులు భాషపంగు పర్శ, చింతపండు సిద్దయ్య, దేవనీ శేఖర్, తెలంగాణ సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేదాంత్ మౌర్య తదితరులు పాల్గొన్నారు.

# బిక్కవోలులో యువతతో పోలీస్ అనుసంధాన కార్యక్రమం




అనపర్తి నియోజికవర్గ ప్రతినిధి, కర్రిదుర్గారెడ్డిబిక్కవోలు,సెప్టెంబర్:10 తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు బిక్కవోలు పోలీస్ స్టేషన్ పరిధిలో యువతతో అనుసంధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు 50 మంది యువత,గ్రామస్థులుహాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికలరక్షణ,భద్రతకుసంబంధించిన పలు అంశాలపై పోలీసులు అవగాహనకల్పించారు. మహిళలు, బాలికలు ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

అదేవిధంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, యువతపై వాటి ప్రభావం గురించి వివరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. దొంగతనాల నివారణ, అప్రమత్తత, అంతర్జాల నేరాలు, అంతర్జాల మోసాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఒకసారి ఉపయోగించే సంకేత సంఖ్యలు, వ్యక్తిగత గుర్తింపు సంఖ్యలు, సంకేతపదాలు, బ్యాంకు ఖాతా వివరాలను అపరిచిత వ్యక్తులతో ఎట్టిపరిస్థితుల్లోనూపంచుకోకూడదని సూచించారు. ముఖ్యంగా గణేష్ ఉత్సవాల సందర్భంగా శబ్దవర్ధక పరికరాలకు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రమా లకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమాన్ని బిక్కవోలు ఎస్ఐ రవిచంద్ర కుమార్, పోలీసు సిబ్బంది నిర్వహించారు.

# ఆహార నాణ్యతపై నిర్లక్ష్యం సహించం



చిత్తూరు, సెప్టెంబర్ 10 జిల్లాలో ఆహార కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ రెండో రోజు పర్యటనలో భాగంగా పూతలపట్టు, యాదమరి, పలమనేరు, కమ్మనవారిపల్లె తదితర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. యాదమరిలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి, పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం, రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పలమనేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించగా, భోజనం రుచిగా ఉండటం లేదని, ఆహార నాణ్యతపై సమస్యలు ఉన్నాయని విద్యార్థులు కిరణ్ దృష్టికి తీసుకువచ్చారు. కోడిగుడ్లను పరిశీలించిన సందర్భంగా సుమారు 2,000 గుడ్ల వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కిరణ్ ఆదేశించారు. సంబంధిత సిబ్బందికి నోటీసులు జారీ చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం యాదమరి మండలం గట్టుకిందఊరు ప్రాంతంలోని రేషన్ షాప్ చేయగా, సుమారు 63 కిలోల పాడైన కందిపప్పు గుర్తించారు. పాడైన ఆహార పదార్థాలను నిల్వ ఉంచడంపై అధికారులను ప్రశ్నించిన కిరణ్, దీనిపై విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తదుపరి కమ్మనవారిపల్లెలో తనిఖీలు నిర్వహించి విద్యార్థులతో మాట్లాడారు. అక్కడి ఆహార, వసతి సదుపాయాలపై విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. సదుపాయాలపై విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేయడంతో కిరణ్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో సివిల్ సప్లైస్ డీఎస్ఓ, డీఎం, అంగన్వాడీ పీడీ, విద్యాశాఖ డీఈఓ, లీగల్ మెట్రాలజీ, ఫుడ్ సేఫ్టీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పెంకు పురుగుల బెడద !

### ఇళ్ల పరిశీలన చేసిన ఎంపీడీవో



కాట్రేనికోన,సెప్టెంబర్10 గ్రామంలో గత కొన్ని రోజులుగా పెంకు పురుగుల (బీటిల్స్) బెడద తీవ్రరూపం దాల్చడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్ల గోడలు, పైకప్పులు, నిత్యావసర సరుకులపై ఈ పురుగులు విపరీతంగా వ్యాపిస్తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతూ సమస్యను ఎంపీడీవో బి. రాజేశ్వర్ రావు దృష్టికి తీసుకెళ్లారు. బాధితుల వినతి మేరకు స్పందించిన ఎంపీడీవో గ్రామంలోని ప్రభావిత ఇళ్లను క్షేత్రస్థాయిలో సూక్ష్మంగా పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి పురుగుల తీవ్రతను స్వయంగా పరిశీలించి, గ్రామస్తులతో మాట్లాడి సమస్య వివరాలను తెలుసు కున్నారు. సమీపంలో ఉన్న భారత ఆహార సంస్థ (ఎఫ్సీఐ) గోడౌన్ నుంచే ఈ పెంకు పురుగులు నివాస ప్రాంతాల్లోకి భారీగా వ్యాపిస్తున్నా యని స్థానికులు ఆయనకు వివరించారు. గోడౌన్లలో నిల్వ ఉంచిన ధాన్యం నిల్వల నుంచే ఇవి ఇళ్లపైకి దండెత్తుతున్నాయని బాధితులు వాపోయారు. దీనిపై ఎంపీడీవో రాజేశ్వర్ రావు స్పందిస్తూ, ఎఫ్సీఐ ఉన్నతాధికారు లతో తక్షణమే మాట్లాడి సమస్య తీవ్రతను వివరిస్తామని తెలిపారు. గోడౌన్లతో పాటు గ్రామ పరిసరాల్లో క్రిమిసంహారక మందుల పిచికారీ తదితర శాశ్వత నివారణ చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పురుగుల బెడద నుంచి ప్రజలకు త్వరలోనే ఉపశమనం కల్పిస్తామని స్పష్టం చేశారు.

## విజయవాడలో ఘనంగా 'స్వచ్ఛతా రన్'..

### పోస్టర్ను ఆవిష్కరించిన మంత్రి లోకేష్

విజయవాడ సెప్టెంబర్10 ( గాంధీ జయంతిని పురస్కరించుకుని అమరావతి



రన్నర్స్అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ నగరంలో అక్టోబర్ 2న ప్రతిష్టాత్మకంగా "స్వచ్ఛతా రన్" కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రచార పోస్టర్ను రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, సమాజంలో ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనే లక్ష్యంతో ఈ పరుగును నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మొత్తం మూడు విభాగాలలో ఈ పరుగు పోటీలు జరగనున్నాయి. ఈ పరుగులో పాల్గొనాలనుకునే ఔత్సాహికులు, క్రీడాకారులు, యువత ఈ నెల 20వ తేదీలోగా ఆన్లైన్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛతే ధ్యేయంగా సాగే ఈ కార్యక్రమంలో నగర ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అమరావతి రన్నర్స్ ప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## పందలపాక లో మట్టి మహాగణపతి నినాదంతో ర్యాలీ





అనపర్తిని యోజికవర్గ ప్రతినిధి,కర్రిదుర్గారెడి పందలపాక,సెప్టెంబర్10:తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం పందలపాక పి ఎమ్ శ్రీ పడాల పెద పుల్లారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో వ్యాయామదర్శకులు లయన్ ద్వారంపూడి యువ రాజారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ వీధులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు పాఠశాల ఏకో క్లబ్ విద్యార్థులచే మట్టి గణపతి పూజిద్దాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే నినాదంతో కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిర్ల శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు విద్యార్థుల నినాదాలు స్కూల్ బ్యాండ్ తో విద్యార్థులు పర్యావరణానికి మేలు చేయు వినాయక చవితిని వేడుకగా జరుపుకోవాలని ప్రజలను జాగృతం చేశారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు చర్ల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో ప్రతి సంవత్సరం ఎకో ఫ్రెండ్లీ గణపతి అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని రెండవ రోజు పందలపాక గ్రామంలో ర్యాలీ నిర్వహణ కార్యక్రమం నిర్వహించా మని రేపు శుక్రవారం విద్యార్థులకు మట్టి గణపతుల తయారీ పోటీని నిర్వహించి గొల్లలమామిడాడ లయన్స్ క్లబ్ శ్రీ సూర్య సౌజన్యంతో విద్యార్థులకు బహుమతులు ప్రశంసా పత్రాలను అందజేయడం జరుగుతుందని తెలిపారు కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కోణాల సత్తిరాజు ఉపాధ్యాయ ప్రతినిధి కర్రి వీరిరెడ్డి పిడి భీమేశ్వర్ రెడ్డి నాగబాబు సూర్యచంద్రరావు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు

హైదారాబాద్, సెప్టెంబర్ 10 హైదరాబాద్ మహానగరంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. చెరువుల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తాము పునరుద్ధరణ పనులు చేపడుతున్న చెరువుల వద్ద నిమజ్జనాలకు ఎలాంటి ఆంక్షలు విధించలేదని ఆయన ఫుల్ క్లారిటీ ఇచ్చారు. అసత్య ప్రచారాలను ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫై చేసిన నాలుగైదు సున్నితమైన చెరువుల

వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా బయో డైవర్సిటీగా గుర్తించిన అమీన్పూర్ చెరువు, నేచురల్ వెట్ల్యాండ్గా రక్షణ పొందిన కాప్రా చెరువులు ఇందులో ఉన్నాయని గుర్తుచేశారు. కాప్రా చెరువులో ప్రస్తుతం నీరు లేనందున అక్కడ ఎవరూ సమస్యలు సృష్టించవద్దని కోరారు. నగరంలోని మిగిలిన అన్ని చెరువులు, జలాశయాల్లో వినాయక నిమజ్జనాలు ఎప్పటిలాగే యథావిధిగా సాగుతాయని స్పష్టం చేశారు. ప్రధాన నీటి వనరులు, చెరువుల పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు, భక్తులు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు విస్తృతంగా 'బేబీ పాండ్స్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## వెంగమాంబ అన్నదాన సత్రాన్ని తనిఖీ చేసిన టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ





తిరుమల,సెప్టెంబరు10 తిరుమల లోని తరిగొండ వేంగమాంబ నిత్య అన్నదాన సత్రాన్ని టీటీడీ పాలక మండలి సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్నదాన సముదాయంలో భక్తులకు అందుతున్న సేవలపై ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. సాధారణ భక్తుడిలా క్యూలైన్లో కూర్చున్న నెహ్రూ, భక్తులతో కలిసి స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భోజనం నాణ్యత, రుచి, ప్రాంగణంలోని పరిశుభ్రతపై అక్కడున్న భక్తులను స్వయంగా అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ... తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే లక్షలాది మంది భక్తులకు నిరంతరాయంగా నాణ్యమైన, రుచికరమైన అన్నప్రసాదాన్ని అందించడంలో టీటీడీ అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తోందని కొనియాడారు. పరిశుభ్రత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా సేవలందిస్తున్న సిబ్బంది, అధికారుల పనితీరును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కూటమి ప్రభుత్వ హయాంలో తిరుమలలో సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం దక్కుతోందని, స్వామివారి దర్శనం మరింత సులభతరమైందని పేర్కొన్నారు. క్యూలైన్లలో తాగునీరు, వైద్య సేవలు, ఉచిత రవాణా, కల్యాణకట్టలో తలనీలాల సమర్పణ, లడ్డూ ప్రసాద పంపిణీ వంటి అన్ని విభాగాల్లోనూ సౌకర్యాలు సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపారు. టీటీడీ పాలకమండలి సభ్యుడిగా శ్రీవారి భక్తులకు భవిష్యత్తులో మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## సంపాదకీయం

# ప్రైవేటీకరణకే మొగ్గు?

ఇస్రో అంటే నేటి ప్రపంచంలో తెలియని వారుండరు. ఇస్రో అంతరిక్షయానంలో కీలక అడుగులు వేస్తూ భారతదేశ అమ్ములపొదిలో తనదైన స్థానంతో ముందుకు దూసుకుపోతోంది. ఇప్పటికే ఎన్నో పరిశోధనలతో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని దక్కించుకుంది. అలంటి ఇస్రో నేడు ప్రైవేటుపరం కాబోతోందని పుకార్లు చికారై చెక్కర్లు కొడుతోంది. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రైవేటీకరణ అడ్డూఅదుపు అనేది లేకుండా సాగిపోతున్నది. అనేక ప్రభుత్వరంగ కంపెనీలను ఒక్కొక్కటిగా అస్మదీయులైన కార్పొరేట్లకు కట్టబెడుతుండటం తెలిసిందే. ముఖ్యంగా రేవులు, విమానాశ్రయాల ప్రైవేటీకరణ ఈ ధోరణికి అద్దం పడుతున్నది. తాజాగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేట్ బాట పట్టిస్తున్నారనే వివాదం ముసురుకుంటున్నది. ప్రభుత్వం ఇస్రోను ప్రైవేటీకరించడం లేదని అంటున్నప్పటికీ, జరుగుతున్న పరిణామాలు మరోరకం సంకేతాలు వెలువరిస్తున్నాయి. రాకెట్ల తయారీ, ఉపగ్రహాల నిర్మాణం, లాంచ్ సేవలు వంటి కీలక రంగాలను క్రమంగా ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే యత్నాలు జరుగుతున్న మాట వాస్తవం. ఒకప్పుడు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అంతరిక్ష రంగంలో కార్పొరేట్ పెట్టుబడులకు ద్వారాలు తెరుచుకుంటున్నాయిజరుగుతున్న పరిమాణాలపై ఇస్రో సిబ్బందిలో అసమ్మతి రాజుకుంటున్నది. తమ ప్రాముఖ్యం తగ్గిపోతుందని శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. అనుభవజ్ఞులైన శాస్త్రవేత్త లు ప్రైవేట్ రంగానికి వెళ్లిపోతున్నారనే వార్తలు కూడా జోరుగా వినవస్తున్నాయి. అందుకు ఉద్యోగులు ఎంచుకుంటున్న స్వచ్ఛంద ఉద్యోగ విరమణపై సంస్థ ఆంక్షలు విధించాల్సి రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడం తప్పు కాదు. ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష రంగంలో ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్యం పెరుగుతున్నది. కానీ అక్కడ ప్రభుత్వ సంస్థలు తమ కేంద్రీయ పాత్రను కోల్పోవడం లేదు. ఉదాహరణకు, అమెరికాలో నాసా ప్రైవేట్ కంపెనీలతో పనిచేస్తున్నప్పటికీ, దిశానిర్దేశం, నియంత్రణ, పరిశోధనలో కీలక స్థానాన్ని నిలుపుకొంటున్నది. కానీ భారతదేశంలో మాత్రం పరిస్థితి భిన్నంగా మారుతున్నదనే వాదన వినిపిస్తున్నది. ఇస్రోను బలహీనపరుస్తూ, కార్పొరేట్ సంస్థలను ముందుకు తెస్తున్నారనే విమర్శలు జోరందుకుంటున్నాయి. ఇస్రోలో ప్రైవేటీకరణ దిశగా జరుగుతున్న చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఉద్యోగ సంఘాలు కేంద్ర ప్రభుత్వానికి గట్టిగా అల్టిమేటమ్ ఇచ్చాయి. ఇస్రో స్వరూప, స్వభావాలను దెబ్బతీసే విధంగా కీలక కార్యకలాపాలను ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తే తాము మౌనంగా ఉండబోమని తాఖీదు జారీ చేశాయి. పరిశోధన స్వాతంత్ర్యం, ఉద్యోగ భద్రత, సంస్థ భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వం తక్షణమే తన విధానాలపై పునరాలోచన జరుపాలని కోరుతున్నాయి. లేకపోతే ఆందోళనలకు దిగడమే కాకుండా, దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తల స్థాయిలో నిరసనలు ఉధృతం చేసే అవకాశమున్నదని తెలిపాయి. ఇది కేవలం ఉద్యోగుల అసంతృప్తి కాదు, ఇస్రో భవిష్యత్తుపై పెరుగుతున్న ఆందోళనకు ప్రతిబింబం. ఇన్-స్పేస్, ఎన్ఎస్ఐఎల్ వంటి కొత్త సంస్థలు కూడా ఈ చర్చలోకి వస్తున్నాయి. ఆదానీ, అంబానీ వంటి దేశంలోని అగ్ర కార్పొరేట్ సమూహాలు అంతరిక్ష రంగంలోకి అడుగుపెట్టడం మరో కీలక చర్చకు దారితీస్తున్నది. ప్రభుత్వ విధానాల మార్పులతో స్పేస్ రంగం ప్రైవేట్ పెట్టుబడులకు ద్వారాలు తెరుచుకోవడంతో, ఈ భారీ కంపెనీలు రాకెట్ తయారీ, ఉపగ్రహ సేవలు, స్పేస్ టెక్నాలజీ వ్యాపారాల్లో అవకాశాలను అన్వేషిస్తున్నాయి.

ఒకవైపు ఇది పెట్టుబడులు, సాంకేతిక అభివృద్ధికి దోహదపడుతుందనే వాదన ఉన్నప్పటికీ, మరోవైపు ఇస్రో వంటి ప్రభుత్వరంగ సంస్థల సామర్థ్యాన్ని ఉపయోగించుకొని కార్పొరేట్లు అదే రంగంపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ విధానాల్లో పారదర్శకత లేకపోవడం, స్పష్టమైన హద్దులు లేకపోవడం వల్ల సందేహాలు మరింత బలపడుతున్నాయి. ప్రైవేట్‌రంగ భాగస్వామ్యంతో అంతరిక్ష రంగం విస్తరిస్తుందని, పెట్టుబడులు వస్తాయని తద్వారా ఉద్యోగాలు పెరుగుతాయనేది ప్రభుత్వ వాదన.

ఇది కొంతవరకు నిజమే కావచ్చు. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించాల్సిందే. అయితే అందుకు ఇస్రోను బలిపెట్టకుండా చూడాలి. పరిశోధన, ఆవిష్కరణ, వ్యూహాత్మక నియంత్రణ.. ఇవన్నీ ఇస్రో చేతుల్లోనే ఉండాలి. కార్పొరేట్ సంస్థలు సహాయక భాగస్వాములుగా మాత్రమే ఉండాలి. ఏదేమైనా ఇస్రోను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఒకవేళ ప్రైవేటు దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తే అలాంటి ఆలోచనలు విరమించుకోవాలి. ప్రైవేటు దిశగా ప్రయత్నాలు చేస్తే దేశ అడ్డుకొని ప్రైవేటు పరంగా కాకుండా చూడాల్సిన బాధ్యత దేశ్ ప్రజలపై ఎంతైనా ఉంది.

# పశ్చిమాసియా మళ్లీ భగ్గు..
# 5 ఇరాన్ చమురు ట్యాంకర్ల పేల్చివేత

- 5 ఇరాన్ చమురు ట్యాంకర్ల పేల్చివేత
- తమ యుద్ధ నౌకలపై దాడులకుఅమెరికా సైన్యం ప్రతీకారం
- జోర్డాన్‌లోని అమెరికా బేస్‌లపై ఇరాన్ ప్రతిదాడులు

వాషింగ్టన్, సెప్టెంబర్ 9: తన యుద్ధ నౌకలపై జరిగిన తాజా దాడులకు ప్రతీకారంగా ఐదు ఇరాన్ చమురు ట్యాంకర్లను ధ్వంసం చేసినట్టు అమెరికా సైన్యం ప్రకటించగా జోర్డాన్‌లోని అమెరికా లక్ష్యాలపై దాడులు నిర్వహించినట్టు ఇరాన్ వెల్లడించింది. ఆరు నెలలకు పైగా సాగుతున్న యుద్ధంలో ఇరు పక్షాల మధ్య పరస్పర దాడులు మళ్లీ తీవ్రరూపం దాల్చి పరిస్థితిని తిరిగి ప్రత్యక్ష ఘర్షణల వైపునకు నెట్టాయి. అమెరికా దాడుల అనంతరం జోర్డాన్‌లోని అమెరికా లక్ష్యాలపై ఇరాన్ క్షిపణులను ప్రయోగించిందని ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది.అమెరికా దళాలకు ఆతిథ్యం ఇస్తున్న జోర్డాన్ అమెరికాకు ఒక బలమైన మిత్రదేశం. దీనివల్ల ఆ దేశంలోని సైనిక స్థావరాలు ఇరాన్ జరిపే వరుస దాడులకు లక్ష్యంగా మారుతున్నాయి. ఈ తాజా దాడులు యుద్ధానికి ముగింపు పలికేందుకు ప్రయత్నిస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న ఆర్థిక, సైనికపరమైన ద్వంద్వ విధానంలో భాగం. మిగిలిన వాణిజ్య భాగస్వాముల నుంచి ఇరాన్‌ను ఏకాకిని చేసే తన కొత్త ప్రయత్నంలో భాగంగా ట్రంప్ ప్రభుత్వం మంగళవారం ఇరాన్ విమానయాన పరిశ్రమలోని అదనపు అంశాలపై కూడా ఆంక్షలు విధించింది. ఇందులో భాగంగా రెండు డజన్లకు పైగా వాణిజ్య, ప్రైవేట్ విమానయాన సంస్థలతో పాటు విదేశీ కార్గో సేవా సంస్థలను కూడా లక్ష్యంగా చేసుకుంది.

బర్‌లో జరగనున్న మధ్యంతర ఎన్నికలకు ముందు పెరుగుతున్న ఇంధన ధరలు ట్రంప్, ఆయన రిపబ్లికన్ పార్టీకి రాజకీయపరమైన సమస్యలను సృష్టిస్తున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన బ్రెంట్ ముడి చమురు బ్యారెల్ ధర మంగళవారం గరిష్ఠంగా 99.46 డాలర్లకు చేరింది. అమెరికా విమాన వాహక నౌక, డిస్ట్రాయర్‌పై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ బాలిస్టిక్ క్షిపణులతో దాడికి ప్రయత్నించిన తర్వాత శనివారం అమెరికా దళాలు మూడు ఇరాన్ చమురు ట్యాంకర్లను కూడా ధ్వంసం చేశాయి. కాగా ఇరాన్ దాడులను అమెరికా ఉపేక్షించబోదని విదేశాంగ మంత్రి మార్కో రూబియో మంగళవారం హెచ్చరించారు. అమెరికా నౌకాదళ నౌకలపై దాడులు చేసేందుకు ఇరాన్




ప్రయత్నిస్తూనే ఉంది. వారు అలా చేసిన ప్రతిసారీ వారు తమ ట్యాంకర్లను కోల్పోవలసి వస్తుంది. ఈ రోజు కూడా మీరు దాన్ని చూస్తారు అని విలేకరులతో మాట్లాడుతూ రూబియో అన్నారు.

### అమెరికా జలాంతర్గామిని స్వాధీనం చేసుకున్నాం: ఇరాన్

హెర్మూజ్ జలసంధి ముఖ ద్వారం వద్ద అమెరికా సైన్యానికి చెందిన అత్యంత ఆధునిక మానవరహిత జలాంతర్గాములలో ఒకదానిని స్వాధీనం చేసుకున్నట్టు ఇరాన్ నౌకాదళం ప్రకటించింది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్(ఐఆర్‌జీసీ) అధికారిక వార్తా సంస్థ సెపా న్యూస్ ప్రచురించిన ఒక ప్రకటనలో డైవ్-ఎల్‌డీగా గుర్తించిన ఈ జలాంతర్గామిని ఒక సంక్లిష్టమైన నిఘా ఆపరేషన్‌లో స్వాధీనం చేసుకున్నట్టు నౌకాదళం తెలిపింది.

# మంత్రాల నెపంతో మహిళ దారుణ హత్య..

హైదారాబాద్, సెప్టెంబర్ 10: మంత్రాలు చేస్తున్నారనే అనుమానం ఓ మహిళ ప్రాణాలను బలిగొన్న విషాద ఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని నెల్కి వెంకటాపూర్ గ్రామానికి చెందిన సింగతి లక్ష్మి (42)ను ఆమె మరిది అర్ధరాత్రి సమయంలో దారుణంగా నరికి హత్య చేసిన ఘటన కలకలం రేపింది. తాజాగా ఈ కేసులో పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. గ్రామంలో అందరూ నిద్రిస్తున్న సమయంలో లక్ష్మిపై దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు. మంత్రాలు చేస్తున్నారనే అనుమానంతోనే ఆమెను హత్య చేసినట్లు దర్యాప్తులో తేలినట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి సమయంలో జరిగిన ఈ దారుణంతో కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. హత్యకు దారితీసిన పరిస్థితులు, మంత్రాలపై ఉన్న అనుమానం, నిందితుల పాత్ర వంటి అంశాలపై ఆరా తీశారు. దర్యాప్తులో ఇద్దరిని



నిందితులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి కేసుకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు.

నిందితుల నుంచి హత్యకు ఉపయోగించినట్లు భావిస్తున్న ఒక గొడ్డలితో పాటు సెల్‌ఫోన్, మోటార్‌సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వస్తువులను కేసు దర్యాప్తులో కీలక ఆధారాలుగా పరిగణిస్తున్నారు. హత్య వెనుక మరేదైనా కారణం ఉందా? మంత్రాలపై ఉన్న అనుమానమే అసలు కారణమా? అనే కోణాల్లోనూ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మూఢనమ్మకాల కారణంగా ఓ మహిళ ప్రాణాలు కోల్పోవడం నెల్కి వెంకటాపూర్‌లో తీవ్ర విషాదాన్ని నింపింది. 42 ఏళ్ల లక్ష్మి దారుణ హత్యకు గురికావడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. తాజాగా ఇద్దరు నిందితుల అరెస్టుతో కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. అయితే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు దర్యాప్తు అనంతరం వెల్లడించనున్నారు.

# లోకేశ్ అడ్డంగా దొరికిపోయారు

**డీఎస్సీ, ఏపీపీఎస్సీ లో భారీగా అక్రమాలు**

**వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి**



అమరావతి, సెప్టెంబర్ 10: ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన డీఎస్సీ, ఏపీపీఎస్సీ పరీక్షల్లో ఎన్నడూ లేనంత స్థాయిలో భారీ అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని... విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ ఈ కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయారని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. డీఎస్సీ అక్రమాలపై ప్రభుత్వం మౌనం వహిస్తోందని... లోకేశ్ కు మంత్రి పదవిలో కొనసాగే అర్హత, హక్కు రెండూ లేవని మండిపడ్డారు. ఈ మొత్తం నియామక అక్రమాలపై తక్షణమే సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. డీఎస్సీపై ప్రతిపక్షాలు, అభ్యర్థులు ఆధారాలతో సహా ప్రశ్నిస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేశ్ ఏమీ మాట్లాడకుండా మత్తు ఇంజక్షన్లు తీసుకున్నట్లు మౌనం పాటిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఐఏఎస్ అధికారులను ముందరకు నెట్టి మాట్లాడిస్తున్నారని ఆరోపించారు. "నారా లోకేశ్ ఉద్యోగాలను బఠానీలు అమ్మినట్లు మార్కెట్లో అమ్మేశారు. ఆయన దొరికిపోయిన దొంగ. రాజకీయాలకు, మంత్రి పదవికి ఎంతమాత్రం పనికిరారు" అని తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. లోకేశ్ ను భవిష్యత్తులో ముఖ్యమంత్రిని చేయాలని చూస్తున్నారని, ఒకవేళ ఆయనకు ఆ పదవి ఇస్తే ఏకంగా రాష్ట్రంతో పాటు దేశాన్నే అమ్మేస్తారని ఎద్దేవా చేశారు. లోకేశ్ వైఖరి వల్లే టీడీపీ సర్వనాశనం కాబోతోందని వ్యాఖ్యానించారు.

ఇప్పటికే జరిగిన డీఎస్సీలోనే వందలాది పోస్టులు అక్రమాలకు గురయ్యాయని, మళ్లీ మరో రెండు డీఎస్సీలు నిర్వహిస్తామని ప్రకటించడం నిరుద్యోగులను మోసం చేయడమేనని అన్నారు. నిరుద్యోగ యువత భవిష్యత్తుతో ఆడుకున్న లోకేశ్ తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని అన్నారు.

## ఈనెల 12వ తేదీన జాతీయ లోక్ అదాలత్

ఏలూరు, సెప్టెంబరు 10 జాతీయ న్యాయసేవా అధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ వారి ఆదేశాలు ప్రకారం ఈనెల 12వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లుగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి యస్.శ్రీదేవి ఈరోజు జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో తెలియజేశారు.ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి యస్.శ్రీదేవి మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ నందు కేసులు పరిష్కారానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందని, నేటి వరకు జిల్లా వ్యాప్తంగా 10,577 కేసులను రాజీయోగ్యమైన కేసులుగా గుర్తించడం జరిగిందని అన్నారు.




## స్వల్ప లాభాలతో ముగిసిన

# భారత స్టాక్ మార్కెట్లు

, సెప్టెంబర్ 10: ఇవాళ (గురువారం) భారత స్టాక్ మార్కెట్లు స్వల్ప లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్ సెషన్ చివర్లో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లలో ఒక్కసారిగా కొనుగోళ్ల మద్దతుతో సెన్సెక్స్ (0.19శాతం) పెరిగి 138.36 పాయింట్ల లాభంతో 74,902.59 వద్ద ముగిసింది. నిఫ్టీ (0.20శాతం) పుంజుకుని 46.30 పాయింట్లతో 23,477.80 దగ్గర స్థిరపడింది.

టాప్ గెయినర్స్:

పవర్ గ్రిడ్: 2.27శాతం పెరిగి రూ.272 వద్ద నిలిచింది

యాక్సిస్ బ్యాంక్: 1.65శాతం లాభపడి రూ.1,260 వద్ద ముగిసింది

అల్ట్రాటెక్ సిమెంట్: 1.44శాతం పెరిగి రూ.11,053 కు చేరింది

ఎన్‌టీపీసీ (1.13శాతం), టెక్ మహీంద్రా (1.09శాతం), భారతీ ఎయిర్‌టెల్ (1.00శాతం), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (0.98శాతం) లాభపడ్డాయి.

టాప్ లూజర్స్:

హెచ్‌సీఎల్ టెక్నాలజీస్: 2.43శాతం క్షీణించి రూ.1,196.80 వద్ద అత్యధికంగా నష్టపోయింది

టాటా స్టీల్ (1.38శాతం), ట్రెంట్ (1.12శాతం), ఐటీసీ (0.84శాతం) నష్టాల్లో ముగిశాయి.

బ్రాడర్ మార్కెట్ ట్రెండ్ విషయానికొస్తే, ప్రధాన బెంచ్‌మార్క్ సూచీలు లాభపడినప్పటికీ, బ్రాడర్ మార్కెట్ (మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్) ఒత్తిడిలోనే కొనసాగింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100.. 0.38శాతం క్షీణించింది. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100.. 0.07శాతం నష్టపోయింది. కీలకమైన బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాలు లీడ్ తీసుకుని సూచీలను ఆదుకోగా, ఆటో, ఫార్మా, మెటల్ రంగాలు వెనుకంజవేశాయి.

# ఆన్‌లైన్ కస్టమర్లకు గుడ్ న్యూస్.. ఏడు కీలక మార్పులు!




ఆన్‌లైన్ ద్వారా షాపింగ్ చేసే వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించడం, పారదర్శకతను పెంచడం కోసం కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ 'వినియోగదారుల పరిరక్షణ (ఈ-కామర్స్ సవరణ) నిబంధనలు, 2026' ని ప్రకటించింది. ఈ కొత్త నిబంధనలు 2027 జనవరి 1 నుంచి అమలులోకి రానున్నాయిఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు ఏదైనా వస్తువుపై డిస్కౌంట్ ప్రకటించినప్పుడు, సవరించిన ధరతో పాటు దానికి ముందు ఉన్న 'అసలు ధర' (ౖతీఱశీ ౖాతీఱవ) ను స్పష్టంగా చూపించాలి. డిస్కౌంట్ ప్రకటించడానికి ముందస్తుగా గడిచిన 30 రోజులలో ఆ వస్తువు విక్రయించిన అత్యంత తక్కువ ధరనే అసలు ధరగా పరిగణించాలి.

2. సెర్చ్ రిజల్ట్స్‌ను మేనిపులేట్ చేయడానికి వీల్లేదు

యూజర్లు ఒక వస్తువు కోసం వెతికినప్పుడు ప్లాట్‌ఫామ్‌లు తప్పుదోవ పట్టించేలా సెర్చ్ ఫలితాలను కావాలని మార్చడం లేదా ర్యాంకింగ్‌ను ప్రభావితం చేయడం నిషేధం.

3. స్పాన్సర్డ్ ప్రొడక్ట్స్‌పై స్పష్టత

ఏదైనా ఉత్పత్తి ప్రకటన (ఖఱఎ/నాజూశీఅంశీతీవఎ) ద్వారా సెర్చ్ రిజల్ట్స్‌లో నిలిస్తే, దానిని 'స్పాన్సర్డ్' అని స్పష్టంగా సూచించాలి. దీనివల్ల వినియోగదారులు సాధారణ ఫైండింగ్స్‌కు, డబ్బు చెల్లించి చూపించే ప్రమోషనల్ ప్రొడక్ట్స్‌కు తేడాను సులభంగా గుర్తించగలరు.

4. 'డార్క్ ప్యాటర్న్స్'పై కఠిన ఆంక్షలు

వినియోగదారులను మోసం చేసేందుకు లేదా బలవంతంగా కొనుగోలు చేయించేందుకు ఉపయోగించే డిజిటల్ ట్రిక్స్ ('డార్క్ ప్యాటర్న్స్') ని నిరోధించేందుకు 2023 మార్గదర్శకాలను తప్పనిసరి చేశారు. ప్రతి ఈ-కామర్స్ సంస్థ ప్రతి సంవత్సరం 'సెల్ఫ్-ఆడిట్' నిర్వహించి కంప్లైయన్స్ సర్టిఫికెట్‌ను ప్లాట్‌ఫామ్‌పై ప్రదర్శించాలి.

5. దిగుమతి చేసుకున్న ఉత్పత్తుల వివరాలు (జశీబఅ్‌తీవ శీట ూతీఱస్త్రఱఅ) విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న వస్తువులకు సంబంధించి, ఆ వస్తువు ఏ దేశానికి చెందింది (జశీబఅ్‌తీవ శీట ూతీఱస్త్రఱఅ) దానిని దిగుమతి చేసుకున్న వారి వివరాలను స్పష్టంగా చూపించాలి.

# ప్రొటీన్ పౌడర్లను తీసుకోవడంపై చాలా మందికి ఉండే అపోహలు ఇవే..



ప్రస్తుతం ప్రొటీన్ పౌడర్లు కేవలం బాడీబిల్డర్లు, క్రీడాకారులు మాత్రమే ఉపయోగించే సప్లిమెంట్లుగా కాకుండా సాధారణ ఆహారంలోనూ భాగంగా మారుతున్నాయి. వ్యాయామం తర్వాత షేక్‌గా తీసుకోవడం, ఉదయం ఓట్స్‌లో కలుపుకోవడం వంటి పద్ధతుల్లో చాలామంది వీటిని ఉపయోగిస్తున్నారు. కండరాల పునరుద్ధరణ, బరువు నియంత్రణ, శక్తి పెంపు కోసం ప్రొటీన్ పౌడర్లు ఉపయోగపడతాయని చెబుతున్నప్పటికీ, వీటి భద్రత, మోతాదుపై అనేక అపోహలు ఉన్నాయి. ప్రొటీన్ పౌడర్లకు సంబంధించి సాధారణంగా వినిపించే పది అపోహలు, వాటి వెనుక ఉన్న వాస్తవాల గురించి నిపుణులు వివరిస్తున్నారు. ప్రొటీన్ పౌడర్లు తీసుకుంటే ఆరోగ్యవంతమైన వ్యక్తుల్లో కిడ్నీలు దెబ్బతింటాయనేది ఒక సాధారణ అపోహ. అయితే కిడ్నీల పనితీరు సాధారణంగా ఉన్నవారు సిఫారసు చేసిన రోజువారీ పరిమితుల్లో ప్రొటీన్ లేదా ప్రొటీన్ సప్లిమెంట్లు తీసుకోవడం సాధారణంగా సురక్షితమే. అయితే ఇప్పటికే దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి ఉన్నవారు మాత్రం ప్రొటీన్ తీసుకునే పరిమాణాన్ని తప్పనిసరిగా నియంత్రించాల్సి ఉంటుంది. ఆరోగ్యవంతమైన, చురుకైన వ్యక్తుల్లో సిఫారసు చేసిన పరిమితికి మించి ప్రొటీన్ తీసుకున్నా కిడ్నీల వడపోత సామర్థ్యం లేదా మొత్తం కిడ్నీ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆధారాలు లేవని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

కేవలం క్రీడాకారులు, బాడీబిల్డర్ల కోసమేనా..

ప్రొటీన్ పౌడర్లు కేవలం బాడీబిల్డర్లు, క్రీడాకారుల కోసమేననేది మరో అపోహ. ప్రొటీన్ శరీరానికి అవసరమైన ముఖ్యమైన పోషక పదార్థం. ఎంజైమ్‌ల తయారీ, రోగనిరోధక వ్యవస్థ పనితీరు, కణజాలాల పునరుద్ధరణ, హార్మోన్ల సమతుల్యత వంటి అనేక ప్రక్రియల్లో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. వ్యాయామం చేయని పెద్దలు, వయసు పెరుగుతున్న కొద్దీ కండరాల పరిమాణం తగ్గే సమస్యను ఎదుర్కొంటున్న వృద్ధులు, అనారోగ్యం నుంచి కోలుకుంటున్నవారు కూడా రోజువారీ ప్రొటీన్ అవసరాలను తీర్చుకోవడానికి సప్లిమెంట్లను ఉపయోగించవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

ప్రొటీన్ పౌడర్ తీసుకుంటే మహిళలు వెంటనే భారీ కండరాలతో కనిపిస్తారనేది కూడా అపోహే. గణనీయంగా కండరాలు పెరగాలంటే ప్రత్యేకమైన వ్యాయామ ప్రేరణ, క్రమంగా పెంచే శక్తి శిక్షణ, తగినంత కేలరీల తీసుకోవడం వంటి అనేక అంశాలు అవసరం. మహిళల్లో పురుషులతో పోలిస్తే టెస్టోస్టెరాన్ స్థాయిలు తక్కువగా ఉండటం వల్ల కేవలం ఆహారంలో ఒక స్కూప్ ప్రొటీన్ పౌడర్‌ను చేర్చడం ద్వారా భారీ కండరాల శరీరాకృతి ఏర్పడదు. బదులుగా ప్రొటీన్ సన్నని కండరాల నిర్మాణం, శరీర జీవక్రియ ఆరోగ్యానికి తోడ్పడుతుంది.

# వెజ్, నాన్ వెజ్ ఆహారాల్లో ఉండే ఐరన్ భిన్నంగా ఉంటుందని తెలుసా..?

శరీరంలో హిమోగ్లోబిన్ తయారవ్వడానికి ఐరన్ ఎంతో అవసరమైన పోషకం. శరీరానికి తగినంత ఐరన్ అందకపోయినా, అందిన ఐరన్ సరిగ్గా శోషించకపోయినా ఐరన్ లోపం, రక్తహీనత వంటి సమస్యలు ఏర్పడతాయి. దీంతో తరచూ అలసట, నీరసం, తల తిరగడం, శారీరక శ్రమ చేసినప్పుడు త్వరగా అలసిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తక్కువ ఖర్చుతో ఐరన్ అందించే ఆహారాల కోసం చూస్తున్నవారికి మునగ ఆకులు, మసూర్ పప్పు వంటి వాటిని ఆహారంలో చేర్చుకోవాలి. అయితే ఐరన్ అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం మాత్రమే సరిపోదు. అందులోని ఐరన్‌ను శరీరం ఎంతమేర శోషించుకుంటుందనేది కూడా ముఖ్యమే. మొక్కల ఆధారిత ఆహారాల్లో ప్రధానంగా నాన్-హీమ్ ఐరన్ ఉంటుంది. ఇది మాంసాహార ఆహారాల్లో లభించే హీమ్ ఐరన్‌తో పోలిస్తే శరీరంలో తక్కువగా శోషణకు గురవుతుంది. అందుకే కేవలం ఐరన్ ఎక్కువగా ఉన్న ఆహారాన్ని ఎక్కువ మోతాదులో తీసుకోవడం వల్ల రక్తంలో ఐరన్ స్థాయిలు తప్పనిసరిగా పెరుగుతాయని చెప్పలేమని నిపుణులు చెబుతున్నారు. మునగ ఆకులు, మసూర్ పప్పు వంటి చవకైన ఆహారాలు ఐరన్‌ను అందించగలిగినా, వాటిని సరైన ఆహారాలతో కలిపి తీసుకోవడం ద్వారా శరీరానికి మరింత ప్రయోజనం కలిగే అవకాశం ఉంటుంది.

విటమిన్ సి ముఖ్యం..

నాన్-హీమ్ ఐరన్ శోషణను మెరుగుపరచడానికి విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాలను ఐరన్ ఉన్న పదార్థాలతో కలిపి తీసుకోవడం సులభమైన మార్గాల్లో ఒకటి. నిమ్మకాయ, ఉసిరికాయ, జామపండు, నారింజ, టమాటా వంటి వాటిలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఉదాహరణకు మసూర్ పప్పు లేదా మునగ ఆకులతో చేసిన వంటకంలో కొద్దిగా నిమ్మరసం కలపడం, లేదా ఆహారంతో పాటు విటమిన్ సి అధికంగా ఉండే పండ్లను తీసుకోవడం ద్వారా ఐరన్ శోషణకు సహాయపడతాయి. అయితే ఐరన్ అధికంగా ఉండే భోజనంతోపాటు టీ లేదా కాఫీ తీసుకోవడం మాత్రం తగ్గించాలి. టీ, కాఫీలో ఉండే కొన్ని సమ్మేళనాలు ముఖ్యంగా మొక్కల నుంచి లభించే నాన్-హీమ్



ఐరన్ శోషణకు ఆటంకం కలిగిస్తాయి. కాబట్టి ఐరన్ ఉన్న ప్రధాన భోజనానికి దగ్గరగా టీ, కాఫీ తాగకుండా ఉండటం మంచిది. రక్తకణాల ఆరోగ్యానికి ఐరన్ ఒక్కటే సరిపోదు. శరీరానికి తగినంత ప్రొటీన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12తో పాటు ఇతర ముఖ్యమైన పోషకాలు కూడా అవసరం. ముఖ్యంగా ఎర్ర రక్తకణాల తయారీ, వాటి పనితీరు సక్రమంగా ఉండేందుకు వివిధ రకాల పోషకాలు అవసరమవుతాయి. అందువల్ల పప్పులు, కూరగాయలు, పండ్లు, సంపూర్ణ ధాన్యాలు, పాలు లేదా ఇతర అనుకూలమైన ప్రొటీన్ వనరులతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవడం ముఖ్యం.

# హెయిర్ స్పా చేయించుకుంటే జుట్టు సమస్యల నుంచి బయట పడవచ్చా.. నిపుణులు ఏం చెబుతున్నారు..?

జుట్టు రాలడం సమస్యతో బాధపడేవారు తరచూ హెయిర్ స్పా వంటి సౌందర్య చికిత్సలను ఆశ్రయిస్తుంటారు. జుట్టుకు పోషణ అందించడం, మూలాలను బలోపేతం చేయడం, రక్త ప్రసరణ మెరుగుపరచడం, జుట్టు రాలడాన్ని తగ్గించడం వంటి ప్రయోజనాలు హెయిర్ స్పా వల్ల కలుగుతాయని ప్రచారం జరుగుతోంది. అయితే హెయిర్ స్పా నిజంగా జుట్టు రాలడాన్ని ఆపగలదా అనే ప్రశ్నకు సమాధానం సాధారణంగా లేదు అనే చెప్పాలి. సాధారణ హెయిర్ స్పా ప్రధానంగా జుట్టును శుభ్రపరచడం, కండిషనింగ్ చేయడం, జుట్టు మృదువుగా, మెరుపుగా కనిపించేలా చేయడం వంటి సౌందర్య ప్రయోజనాల కోసం చేస్తారు. సాధారణ హెయిర్ స్పాలో షాంపూతో జుట్టును శుభ్రం చేయడం, కండిషనింగ్ మాస్క్ లేదా క్రీమ్ వేయడం, తలకు మసాజ్ చేయడం, ఆవిరి లేదా వేడి చికిత్స ఇవ్వడం, చివరగా జుట్టును కడిగి కండిషనింగ్ చేయడం, ఆరబెట్టడం లేదా స్టైలింగ్ చేయడం వంటి ప్రక్రియలు ఉంటాయి. పొడిబారిన, రసాయనాల వల్ల దెబ్బతిన్న జుట్టును ఇవి మృదువుగా, సులభంగా దువ్వుకునేలా చేస్తాయి. జుట్టు విరిగిపోవడం తగ్గితే, జుట్టు రాలడం కూడా తగ్గినట్లు కనిపిస్తుంది.

**రాలడం, విరగడం ఒకటే కావు..**

అయితే జుట్టు రాలడం, జుట్టు విరిగిపోవడం రెండూ ఒకటే కావు. జుట్టు రాలడం అంటే జుట్టు కుదురు నుంచి బయటకు రావడం. జుట్టు విరిగిపోవడం అంటే జుట్టు పొడవులోని ఏదో ఒక భాగంలో వెంట్రుక తెగిపోవడం. కండిషనింగ్ వంటి చికిత్సలు జుట్టు విరిగిపోవడాన్ని కొంతవరకు తగ్గిస్తాయి. కానీ జుట్టు కుదుర్ల నుంచి రాలిపోవడానికి కారణమయ్యే సమస్యను అవి తప్పనిసరిగా పరిష్కరించవు. జుట్టు రాలడానికి అనేక వైద్యపరమైన కారణాలు ఉంటాయి. ఆండ్రోజెనెటిక్ అలోపేషియా, థైరాయిడ్ సమస్యలు, పోషకాహార లోపాలు, హార్మోన్లలో మార్పులు, అనారోగ్యం, ఒత్తిడి, కొన్ని మందుల వాడకం వంటి కారణాల వల్ల జుట్టు రాలుతుంది. కాబట్టి కేవలం సౌందర్య చికిత్సతో ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించడం సాధ్యం కాదు. హెయిర్ స్పా వల్ల తక్షణంగా కనిపించే ప్రయోజనాలు ప్రధానంగా సౌందర్యపరమైనవే. జుట్టు మృదువుగా, మెరుస్తూ, చిక్కులు లేకుండా, సులభంగా నిర్వహించుకునేలా మారుతుంది. తలకు చేసే మసాజ్ కొంత విశ్రాంతిని కూడా కలిగిస్తుంది. అయితే తలకు మసాజ్ చేయడం వల్ల జుట్టు మందం పెరుగుతుందని సూచించే పరిమిత పరిశోధనలు ఉన్నప్పటికీ, హెయిర్ స్పా సాధారణ జుట్టు రాలడాన్ని చికిత్స చేస్తుందని నిర్ధారించే బలమైన ఆధారాలు లేవు.

**చికిత్సల ప్రయోజనం ఎంత..**

జుట్టు పొడిబారడం, పెళుసుగా మారడం, చిక్కులు పడటం, తరచూ రంగులు వేయడం, బ్లీచింగ్, వేడి పరికరాలతో స్టైలింగ్ చేయడం లేదా స్ట్రెయిటెనింగ్ చేయడం వంటి కారణాలతో జుట్టు దెబ్బతింటే కండిషనింగ్ చికిత్సలు కొంత ప్రయోజనం ఇస్తాయి.



ఇవి జుట్టుకు కలిగే యాంత్రిక నష్టాన్ని, తద్వారా జుట్టు విరిగిపోవడాన్ని తగ్గిస్తాయి. కానీ జుట్టు కుదుర్ల నుంచి ఎక్కువగా రాలిపోవడం, పాపిడి వెడల్పు పెరగడం, నుదుటి భాగంలో జుట్టు తగ్గడం, బట్టతల మచ్చలు ఏర్పడటం లేదా జుట్టు క్రమంగా పలుచబడటం వంటి లక్షణాలు ఉంటే హెయిర్ స్పా అసలు సమస్యను పరిష్కరించదు. హెయిర్ స్పా ఉత్పత్తుల్లో రసాయనాలు ఉంటాయా అనే విషయంలో కూడా జాగ్రత్త అవసరం. రసాయనాలు లేవు అనే ప్రచారాన్ని పూర్తిగా నమ్మకూడదు. నీరు, నూనెలు, మొక్కల నుంచి తీసిన పదార్థాలు, ప్రొటీన్లు కూడా రసాయనాలే. ఏ పదార్థాలు ఉన్నాయి, వాటి మోతాదు ఎంత, ఎలా ఉపయోగిస్తున్నారు

అనేదే ముఖ్యమైన విషయం. హెయిర్ స్పా ఉత్పత్తుల్లో సోడియం లారెత్ సల్ఫేట్ వంటి శుభ్రపరిచే పదార్థాలు, కండిషనింగ్ పదార్థాలు, సిలికోన్లు, సువాసనలు, సంరక్షణ పదార్థాలు, ఇతర సౌందర్య పదార్థాలు ఉంటాయి. కొంతమందిలో ఇవి తలపై మంట, చికాకు లేదా అలర్జీ వంటి సమస్యలకు కారణం అవుతాయి.




# స్టైల్‌ని బాగానే వాడేశారు

కంటెంట్ ఉన్నోడికి కటౌట్ చాలు.. ఈ సినిమా డైలాగ్‌ను సినిమాలకే ఆపాదిస్తే.. 'కంటెంట్ మీద నమ్మకం తక్కువ ఉన్నప్పుడు కాంట్రవర్సీ చాలు' అని మార్చొచ్చు. ఇది ఏ ఒకరినో ఉద్దేశించి అన్న మాట కాదు. ఇప్పటివరకు టాలీవుడ్‌లో జరిగిన సినిమా కాంట్రవర్సీలు, ఆ తర్వాత ఆ సినిమాలు పొందిన లాభాలు చూసి అన్నమాట ఇది. ఇక్కడ పేర్లు చెప్పం కానీ.. యువ హీరోలు.. యువ స్టార్ హీరోలు, యువ ప్రామిసింగ్ హీరోలుగా మారడానికి ఈ స్టైల్‌ని బాగానే వాడేశారు. ఇప్పుడు ఎందుకు ఈ చర్చ అనుకుంటున్నారా? ఇప్పుడు టాలీవుడ్‌లో రిలీజ్‌కి రెడీ అవుతున్న ఓ సినిమాకు సంబంధించి ఇదే మాట వినిపిస్తోంది. సమాజంలో చర్చని లేవనెత్తే సినిమా ఇది. ఎంతగా చర్చ జరిగితే మా సినిమాకి అంత మంచిది. ట్రైలర్ విడుదలైన వెంటనే మా సినిమాపై చర్చ మొదలైంది. అది మంచిదే. ఒక రకంగా ట్రైలర్‌తో మేం ప్రేక్షకుల్ని ముందుగానే సిద్ధం చేశాం అని హీరో ఆ సినిమా గురించి ఇటీవల మాట్లాడారు. ఈ మాటల వెనుక అర్థం డిస్కషన్ ఆ తర్వాత ఫుట్‌ఫాల్స్ అని అర్థమవుతోంది. ఇక ఆ సినిమా నిర్మాత అయితే.. సినిమాలో ప్రేక్షకులు ఊహించని విషయాలు, షాకులు మరిన్ని ఉంటాయనేలా మాట్లాడారు. ప్రేక్షకులను ముందే ప్రిపేర్ చేసే ప్రయత్నం ఇది అనిపిస్తోంది. ఈ సినిమాకు రెగ్యులర్ సినిమాల తరహా ముగింపు ఉండదని చెప్పిన నిర్మాత.. సినిమా ఉన్నట్లుండి, ఆగిపోయినట్లు అనిపిస్తుందని, ప్రేక్షకులు అనుకున్నట్లుగా క్లైమాక్స్ ఉండదని చెప్పారు. అలాగే కాస్త 'అతి' డైలాగ్‌లు అనిపించుకున్నవి సినిమాలో ఇంకా బాగుంటాయి అని కూడా చెప్పారు. ఈ సినిమాలోని సీన్స్, మాటలు ఇప్పటివరకు ఎక్కడా చూసి ఉండరని.. అంత సహజంగా తీశారని కూడా ఆ నిర్మాత చెబుతున్నారు. ఇదంతా చూస్తుంటే సినిమా విడుదల తర్వాత 'బేబీ' తరహా చర్చ, రచ్చ అయితే పక్కా

# 'సీక్రెట్ సోల్జర్' నుంచి సాంగ్ రిలీజ్




నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా తెరకెక్కుతున్న సినిమా 'సీక్రెట్ సోల్జర్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై అక్కి విశ్వనాథ్ రెడ్డి దర్శకత్వంలో స్పై డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతుంది. కమల్ కామరాజు, రఘుబాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్.. పలువురు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషించారు.ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజయిన సాంగ్స్, టీజర్, ట్రైలర్స్ అంచనాలు పెంచగా తాజాగా ఈ సినిమా నుంచి ఓయ్ ఓయ్.. అంటూ సాగే సాంగ్ ని రిలీజ్ చేశారు. కార్తీక్ రోడ్రిగ్జ్ సంగీత దర్శకత్వం అందిస్తూ రెహమాన్ రాసిన ఈ సాంగ్ ని కార్తీక్ స్వయంగా పాడాడు. ఈ సినిమా సెప్టెంబర్ 18న థియేటర్స్ లో రిలీజ్ కానుంది.

# అతన్ని ప్రేమించి మోసపోయా..



విలక్షణ నటిగా గుర్తింపు తెచ్చుకుని దక్షిణాదిలోని అన్ని భాషల్లో సత్తా చాటుతున్నారు ఐశ్వర్య లక్ష్మీ. నటనే కాదు ఏ విషయంపై అయినా కుండబద్ధలు కొట్టినట్లు మాట్లాడటం ఆమె స్టైల్. ఎవరు ఏమనుకున్నా సరే తన మనసులో ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతారు ఐశ్వర్య. కొద్దిరోజుల క్రితం పెళ్లి, సహజీవనం విషయంలో ఆమె మాట్లాడిన మాటలు హాట్ టాపిక్‌గా మారాయి. తాజాగా రిలేషన్‌పై ఐశ్వర్య చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. కేరళకు చెందిన ఐశ్వర్య లక్ష్మీ.. మెడిసిన్ చదువుకున్నారు. అయితే డాక్టర్ కాకుండా యాక్టింగ్ వైపు వచ్చారు. అప్పటికే మోడలింగ్ చేస్తూ పలు టాప్ బ్రాండ్స్‌కు సంబంధించిన వాణిజ్య ప్రకటనల్లో నటించారు. 2017లో నవిన్ పౌలే సరసన నటించే అవకాశం ఐశ్వర్యకు దక్కింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి గుర్తింపు రావడంతో పాటు మలయాళ, తమిళ భాషల్లో అనూహ్యంగా బిజీ అయ్యారు. మాయానంది, వారాతన్, పొన్నియన్ సెల్వన్, అమ్ము, కుమారి, గట్టా కుస్తీ, హలో మమ్మీ, మామన్ సినిమాలతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. సత్యదేవ్ హీరోగా వచ్చిన గాడ్సే మూవీ ద్వారా తెలుగు వారిని పలకరించారు ఐశ్వర్య లక్ష్మీ. ఈ ఏడాది తమిళంలో గట్టా కుస్తీ 2 సినిమాతో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం సాయిధరమ్ తేజ్ సరసన సంబరాల ఏటి గట్టు, మలయాళంలో ఆశా సినిమాలలో ఆమె నటిస్తున్నారు. సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే ఐశ్వర్య.. తన సినిమాలు, షూటింగ్స్, ఇతర వ్యక్తిగత వివరాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. 35 ఏళ్లు దాటి 40వైపు చేరుకుంటున్నా ఇంకా పెళ్లి చేసుకోకుండా బ్యాచిలర్‌గానే ఎంజాయ్ చేస్తున్నారు ఈ ముద్దుగుమ్మ. పలుమార్లు ఐశ్వర్య లక్ష్మీ ప్రేమలో పడినట్లుగా రూమర్స్ రాగా.. వాటిని ఆమె ఖండించారు. నేను సింగిల్‌గా చాలా హ్యాపీగా ఉన్నాను.. నన్ను డబుల్ చేసేందుకు ప్రయత్నించొద్దని ఫ్యాన్స్‌పై విరుచుకుపడింది ఐశ్వర్య. జీవితంలో నేను పెళ్లి చేసుకోను.. ఎంతోమంది సన్నిహితులను చాలా దగ్గరి నుంచి చూశా. పెళ్లి కారణంగా కలల్ని చంపుకుని, వ్యక్తిగతంగానూ వారు ఎదగలేకపోతున్నారు. ఇవన్నీ చూసి, ఆలోచించి జీవితంలో పెళ్లి చేసుకోకూడదని నిర్ణయించుకున్నాను. సంతోషకరమైన జీవితాన్ని గడపటానికి పెళ్లి అనేది తప్పనిసరి కాదు. పెళ్లి చేసుకుని విడిపోవడం కంటే, సహజీవనం బెస్ట్ అని ఐశ్వర్య లక్ష్మీ బోల్డ్ కామెంట్స్ చేశారు. తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పెళ్లి, ప్రేమపై ఐశ్వర్య లక్ష్మీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నేను గతంలో ఓ రిలేషన్‌లో మోసపోయా, స్వతహాగా నేను ఆకర్షణలకు లొంగను, అలాంటి ఓ వ్యక్తిని పూర్తి నమ్మి అతని చేతిలో మోసపోయా. ఈ రిలేషన్ ముగిసిన తర్వాతే నా చుట్టూ ఏం జరుగుతుందో తెలుస్తోంది. ఓ మహిళ నన్ను కలిసిన తర్వాతే అతని మోసం బయటపడింది. ఇందులో తన తప్పు లేకపోవడం వల్లే ఆమెపై నాకెలాంటి కోపం రాలేదు. ఈ విషయం గురించి రెండు రోజులు మాత్రమే బాధపడ్డా.. ఆ తర్వాత దానిని మరిచిపోయానని ఐశ్వర్య లక్ష్మీ పేర్కొన్నారు.

# సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన స్వగత కృష్ణన్

తమిళ సినీ పరిశ్రమలో ఓ పోస్ట్ చర్చనీయంగా మారింది. ప్రముఖ గాయని స్వగత కృష్ణన్ చేసిన తాజా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పేరు ప్రస్తావించకుండా ఓ వ్యక్తిపై ఆమె సంచలన ఆరోపణలు చేసింది. ఆ వ్యక్తి మహిళలపై లైంగిక దాడులు, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్, బలవంతపు మత మార్పిడి చేశాడని, అలాంటి వ్యక్తికి ఇండస్ట్రీ కి సపోర్టుగా నిలిచిందని అసంతృప్తి వ్యక్తం చేసింది.సింగర్ స్వగత కృష్ణన్ గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తనకు ఎదురైన చేదు అనుభవాలను వెల్లడించింది. ఓ సంగీత దర్శకుడి స్టూడియోలో తనను




లైంగిక వేధించాడనీ, స్టూడియోలో సౌండ్‌ప్రూఫ్ గది, సీసీటీవీ కెమెరాలు ఉన్నాయని.. అక్కడ జరిగిన ఘటనను రికార్డు చేసి, ఆ ఫుటేజ్‌ను ఉపయోగించి తనను బెదిరించారని ఆమె పేర్కొన్నారు. తనకు మాత్రమే కాకుండా మరికొంతమంది మహిళలకు కూడా ఇదే వ్యక్తి వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయని స్వగత ఆరోపించారు. ఈ పరిణామాల కారణంగానే తాను చెన్నైని విడిచి రిషికేశ్‌కు వెళ్లినట్లు వెల్లడించారు. ఇప్పుడు స్వగత చేసిన తాజా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీతో ఆ వ్యవహారం మరోసారి చర్చలోకి వచ్చింది. పేరు చెప్పకుండా ఓ వ్యక్తిపై సంచలన ఆరోపణలు చేసింది. పలువురు బాధిత మహిళలు ఆరోపణలు చేసినప్పటికీ ఆ వ్యక్తికి సినీ పరిశ్రమలో మద్దతు లభిస్తుంది. ఆ వ్యక్తి ప్రస్తుతం తన సామాజిక ప్రతిష్ట, పీఆర్, ప్రజాభిప్రాయం గురించి ఇంటర్వ్యూలు ఇస్తుండటం ఎలా సాధ్యమవుతోందని ఆమె ప్రశ్నించారు. ఒకవైపు ఇలాంటి ఆరోపణలు ఉండగా.. మరోవైపు పరిశ్రమలో అతడికి గౌరవం, స్వాగతం లభిస్తుండటంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేసింది.

# ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ మూవీ మండాడి



సూరి, సుహాస్ మెయిన్ లీడ్స్ గా తెరకెక్కిన తమిళ్ సినిమా 'మండాడి'. ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్ పై ఎల్రెడ్ కుమార్ నిర్మాణంలో మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. ఈ సినిమాలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటించగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్.. పలువురు కీలక పాత్రలను పోషించారు. మండాడి సినిమా నేడు సెప్టెంబర్ 10న తమిళ్, తెలుగులో రిలీజ్ అయింది. కళింగపట్నంను సట్టపులి(సుహాస్) రూల్ చేస్తూ ఉంటాడు. ఆ ఊళ్ళో సముద్రంలో జరిగే పడవపోటీలు ఎన్నో ఏళ్లుగా చాలా ఫేమస్. 20 ఏళ్లుగా సట్టపులి సునామి రైడర్స్ టీమ్ తో ఆ ఊరిని గెలిపిస్తూ ఉంటాడు. శ్రీను(రవీంద్ర విజయ్) కొడుకు మల్లేష్(మిథున్ జై శంకర్) పడవల పోటీకి సంబంధించిన ఓ విషయంలో గొడవ జరిగి సట్టపులి కొడుకుపై దాడి చేస్తాడు. అది మిస్ అవ్వడంతో ఓ అమ్మాయి సాయంతో హైదరాబాద్ లో ఉన్న ముత్తు కాళీ(సూరి) దగ్గర తలదాచుకుని ఉంటాడు. ముత్తుకాళీ పెళ్లి చేసుకోకుండా సింగిల్ గా ఉంటూ ఓ స్విమ్మింగ్ పూల్ లో పనిచేస్తూ ఉంటాడు. కానీ సట్టపులి మనుషులు మల్లేష్ ని చంపడానికి అక్కడికి కూడా రావడంతో 20 ఏళ్లుగా ఊరికి వెళ్లని ముత్తుకాళీ మల్లేష్ ని తీసుకొని ఊరికి వస్తాడు. అక్కడ పెద్దలు సట్టపులికి ముత్తుకాళీ మధ్య రాజి కుదర్చాలని ట్రై చేసినా అక్కడ పెద్ద గొడవ అవుతుంది. దాంతో కళింగపట్నం నుంచి రెండు టీమ్స్ పోటీ చేయాలి ఎవరు ఓడిపోతే వాళు ృ ఆటని వదిలేయాలి అని నిర్ణయిస్తారు. పోటీకి కొన్ని రోజులు సమయం ఉండటంతో కొత్తవాళ్లకు ముత్తుకాళీ తన కళింగ వారియర్స్ టీమ్ గా